
# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక



ఆక్సియం మిషన్ 4 ప్రయోగానికి సర్వం సిద్ధం

- తరువాయి 2లో..


అమలాపురం | సంపుటి : 10 సంచిక : 108 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | ఆదివారం 08 జూన్ 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 108 08-06-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-


## రేవంత్ కేబినెట్ విస్తరణకు

# రంగం సిద్ధం!..

**అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్**

**తెలంగాణ మంత్రివర్గ విస్తరణకు కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి ఆమోదం**

**ఆదివారం రోజున కేబినెట్ విస్తరణ జరిగే సూచనలు**

**కొత్తగా ముగ్గురు లేదా నలుగురికి మంత్రి పదవులు దక్కే అవకాశం**



హైదరాబాద్ జూన్ 08 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ విస్తరణకు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఆమోదం తెలిపింది. దీంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వంలో త్వరలోనే కొత్త మంత్రులు చేరే అవకాశం ఉంది. విస్తరణ ప్రక్రియ రేపు జరిగే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. రాష్ట్ర మంత్రివర్గంలో కొత్తగా ముగ్గురు నుంచి నలుగురు సభ్యులకు స్థానం కల్పించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మంత్రి పదవుల

- తరువాయి 2లో..



# ప్రజలకు అందుబాటులో ఉండండి..

**లేకుంటే వన్ టైమ్ ఎమ్మెల్యేగా మిగిలిపోతారు : చంద్రబాబు**

- టిడిపి ఎమ్మెల్యేలకు చంద్రబాబు క్లాస్
- ప్రభుత్వ పథకాలను ప్రజలలోకి తీసుకెళ్లాల్సింది మీరే
- పని తీరు మెరుగు పరుచుకుంటే మరిన్ని అవకాశాలు



అమరావతి జూన్ 08 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

కూటమిపై ఎన్నో ఆశలతో ప్రజలు గెలిపించారని.. ఎమ్మెల్యేలు అందరూ అందుకు అనుగుణంగా నడుచుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారనే విషయాన్ని ఎమ్మెల్యేలు గుర్తుపెట్టుకోవాలని సూచించారు. వన్ టైం ఎమ్మెల్యేలుగా మిగిలిపోవద్దని, పనితీరు మెరుగుపరుచుకోవాలని ఆదేశించారు. ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై నమ్మకాన్నిపెంచే విధంగా ఎమ్మెల్యేలు వ్యవహరించాలని కోరారు. తెలుగుదేశం కార్యకర్తలు, నేతలు, ఎమ్మెల్యేలతో అమరావతిలోని టీడీపీ కార్యాలయంలో సీఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా సందర్భంగా జూన్ 12వ తేదీన అమరావతిలో రెండు వేలమందితో ఓ కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నామని చంద్రబాబు తెలిపారు. ఆ తర్వాత కూడా ఏపీవ్యాప్తంగా ఇలాంటి కార్యక్రమం చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎన్డీఏ ప్రభుత్వం ఏడాదిలో చేపట్టిన అభివృద్ధి పనుల గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. ఎమ్మెల్యేలు ఎవరెవరు ఏం చేస్తున్నారనే సమాచారం తన దగ్గర ఉందని తెలిపారు. పార్టీ కార్యకర్తలు, నేతలు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చే నాటికి ఏపీలో ఉన్న పరిస్థితులు కూడా ప్రజలకు తెలియజేయాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. 2024 జూన్‌కి ముందు రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉందని గుర్తుచేశారు. తాను నాలుగోసారి సీఎం అయ్యానని.. కానీ ఇలాంటి పరిస్థితి ఎప్పుడు చూడలేదని వెల్లడించారు సీఎం .

**ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దుతున్నాం..**

ఏపీ ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేస్తున్నామని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. సంక్షేమం, అభివృద్ధిని కొనసాగిస్తున్నామని తెలిపారు. మనం రాష్ట్ర సంక్షేమం కోసం యజ్ఞం చేస్తుంటే రాక్షసులు కొంతమంది భగ్నం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి వారిని కంట్రోల్ చేయాల్సిన అవసరం ఉందని చెప్పుకొచ్చారు. ఏపీలో గతంలో గంజాయి విచ్చలవిడిగా లభ్యం అయ్యేదని.. ఇప్పుడు కంట్రోల్ చేస్తున్నామని అన్నారు. శాంతి భద్రతలు, గంజాయి, రౌడీయిజాన్ని నిర్దాక్షిణ్యంగా అణచి వేస్తామని.. ఎవరిని ఉపేక్షించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. మహానాడు ఈసారి బాగా జరిగిందని చెప్పారు. వచ్చే నెల నాటికి అన్ని కమిటీలు, రాష్ట్ర కమిటీలను నియామకం పూర్తి చేస్తామని తెలిపారు. యోగా దేను జయప్రదం చేయాలని కోరారు. కార్యకర్తలు యోగా చేయడం వల్ల ఆరోగ్యం మెరుగవుతుందని చంద్రబాబు పేర్కొన్నారు.

**ఎఐలో ఎపిని నెంబర్ వన్ చేస్తాం ..**

ఆంధ్రప్రదేశ్‌ను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో దేశానికి మార్గదర్శకంగా నిలపాలన్నది తమ ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు

- తరువాయి 2లో..

## కాగ్ లెక్కలతో రాష్ట్ర ఆర్థిక దుస్థితి బట్టబయలైంది: జగన్

- ఏప్రిల్ 2025 ఆర్థిక గణాంకాలపై కాగ్ నివేదిక విడుదల
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా ఉందన్న జగన్

అమరావతి జూన్ 08 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

జీఎస్టీ వసూళ్లపై ప్రభుత్వ ప్రకటనలకు, కాగ్ లెక్కలకు భారీ తేడా ఉందని వెల్లడి ఐజీఎస్టీ సర్దుబాటు పేరుతో ప్రభుత్వం వాస్తవాలను దాస్తోందని విమర్శ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దిగజారిందంటూ వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో విమర్శలు సంధించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో



స్పందించారు. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) విడుదల చేసిన ఏప్రిల్ 2025 నెలవారీ కీలక సూచికలు తీవ్ర ఆందోళనకరమైన చిత్రాన్ని ఆవిష్కరిస్తున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రచారానికి, వాస్తవ ఆర్థిక స్థితిగతులకు పొంతన లేదని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయని వివరించారు.

**జీఎస్టీ వసూళ్లపై ప్రభుత్వ మాయాజాలం**

మే 1వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం ఒక పత్రికా ప్రకటన విడుదల చేస్తూ, 2025 ఏప్రిల్ నెలలో రాష్ట్రానికి నికర జీఎస్టీ వసూళ్లు రూ. 3,354 కోట్లుగా నమోదయ్యాయని, జీఎస్టీ ప్రవేశపెట్టినప్పటి నుంచి ఇదే అత్యధికమని గొప్పలు చెప్పుకుంది. సాంకేతికంగా చూస్తే, అన్ని సర్దుబాట్ల తర్వాత వచ్చేదే నికర జీఎస్టీ. అయితే, కాగ్ విడుదల చేసిన 2025 ఏప్రిల్ గణాంకాలు అసలు నిజాన్ని

- తరువాయి 2లో..

## జగన్‌కు మంత్రి నారా లోకేశ్ స్ట్రాంగ్ వార్నింగ్

- వైసీపీ అధినేత జగన్‌పై మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో ధ్వజం
- 'సాక్షి'లో మహిళలను, అమరావతిని కించపరిచారని జగన్‌పై లోకేశ్ ఆరోపణ
- మహిళా లోకానికి జగన్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్
- అమరావతి దేవతల రాజధాని అని, దాన్ని కించపరిస్తే ఊరుకోబోమని వ్యాఖ్య
- మహిళల జోలికొస్తే కఠిన చర్యలు తప్పవని సీఎం చంద్రబాబు హెచ్చరించినట్లు వెల్లడి
- జగన్ అనే సైతాన్‌ను అమరావతి తరిమిందని ఘాటు విమర్శలు

అమరావతి జూన్ 08 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

వైసీపీ అధినేత జగన్ పై రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మహిళలను అవమానించిన వారు చరిత్రలో కలిసిపోవడం ఖాయమని హెచ్చరించారు. జగన్ తన మీడియా సాక్షిగా మహిళలను ఘోరంగా

- తరువాయి 2లో..







## ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు

### తెలిపిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్

- హజ్రత్ ఇబ్రహీం త్యాగనిరతికి ప్రతీకగా నిర్వహించుకునే పండుగే బక్రీద్: సీఎం చంద్రబాబు
- హజ్రత్ ఇబ్రహీం స్ఫూర్తిగా అందరూ సాటివారిని ఆదరిస్తూ సహృదయంతో ముందుకు సాగాలన్న సీఎం
- నిస్వార్థమైన ఆత్మీయ అనుబంధాలను వ్యాపింపజేయడమే బక్రీద్ పండుగ ముఖ్యోద్దేశమన్న మంత్రి నారా లోకేశ్

అమరావతి జూన్ 08 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

బక్రీద్ పర్వదినం సందర్భంగా ముస్లిం సోదరులకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. హజ్రత్ ఇబ్రహీం త్యాగనిరతికి ప్రతీకగా నిర్వహించుకునే బక్రీద్ సందర్భంగా ముస్లిం సోదర

- తరువాయి 2లో..

### ఏడు రోజుల్లో కోటి మందికి పైగా

# రేషన్ సరఫరా...

## మంత్రి నాదెండ్ల మనోహర్

**72 శాతం మంది లబ్ధిదారులకు విజయవంతంగా పంపిణీ చేశామన్న మంత్రి**

**రాష్ట్ర ప్రజా పంపిణీ చరిత్రలో గొప్ప మైలురాయిగా పేర్కొన్న నాదెండ్ల**

**వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా ఇంటి వద్దకే సరుకులు అందించే సేవ**

**ఇప్పటివరకు 11,05,439 మందికి ఈ విధంగా పంపిణీ చేసినట్లు వెల్లడి**

అమరావతి జూన్ 08 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

రాష్ట్ర ప్రజా పంపిణీ చరిత్రలో ఒక గొప్ప మైలురాయిగా ఏడు రోజుల్లో కోటి మందికి పైగా రేషన్ సరుకులు అందించడం గర్వకారణమని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల మరియు వినియోగదారుల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

- తరువాయి 2లో..





### 19న అఖండ గోదావరి

## పర్యాటక ప్రాజెక్టుకు శంకుస్థాపన

రాజమహేంద్రవరం జూన్ 08 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఈ నెల 19న రాజమహేంద్రవరంలో అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టుకు శంకుస్థాపన జరుగుతుందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ వెల్లడించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఎంపీ పురందేశ్వరి చేతుల మీదుగా ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. అఖండ గోదావరి ప్రాజెక్టుతో రాజమహేంద్రవరానికి, గోదావరి పర్యాటక ప్రాంతాలకు కొత్త సొబగులు రానున్నాయని ఆయన తెలిపారు. రాష్ట్రాన్ని పర్యాటక ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుతామని చెప్పారు. అఖండ గోదావరి ప్రాజెక్టు పూర్తయితే హేవలాక్ వంతెన, కడియం నర్సరీలు, నిడదవోలు కోట సత్తెమ్మ ఆలయం సరికొత్తగా దర్శనమిస్తాయన్నారు. చారిత్రక, సాంస్కృతిక వైభవాన్ని తెలిపేలా ఈ ప్రాజెక్టుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సందర్శకులకు మెరుగైన వసతుల కల్పన ఇందులో భాగమన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో మంజూరైన ప్రతిష్ఠాత్మక అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టు రూపుదిద్దుకోనుంది. స్పెషల్ అసిస్టెన్స్ టూ స్టేట్ ఫర్ కేపిటల్ ఇన్వెస్ట్ మెంట్ పథకం ద్వారా మంజూరైన రూ.97 కోట్లతో రాజమహేంద్రవరం, ధవళేశ్వరం, కడియం, కొవ్వూరు, నిడదవోలు తదితర ప్రాంతాల్లో పర్యాటక అభివృద్ధి పనులు జరగనున్నాయని మంత్రి వెల్లడించారు. పవిత్ర గోదావరి పుష్కరాలలోపే ఈ ప్రాజెక్టు పనులు పూర్తవుతాయని మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు.



# సంపాదకీయం

## నిర్వహణ లోపమే..!

క్రికెట్ ప్రపంచంలో పెనువిషాదం. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సిబి) విజయోత్సవం జనాల ప్రాణాలు తీసిన దురదృష్టకర దుర్ఘటన. ఐపిఎల్ ఫైనల్‌లో టైటిల్ సాధించిన ఆర్‌సిబి టీంను సన్మానించేందుకు బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియాన్ని బుధవారం అట్టహాసంగా ముస్తాబు చేయగా, అక్కడికి లక్షలాదిగా అభిమానులు, ప్రజలు ముంచెత్తడంతో భారీగా తొక్కిసలాట జరిగి 11 మంది నిష్కారణంగా బలి కావడం మానవమాత్రులెవరినైనా కలచివేస్తుంది. మరణించిన వారిలో ఆరుగురు పురుషులు కాగా ఐదుగురు మహిళలు. దిగ్భ్రాంతిగొలిపే విషయం చనిపోయిన వారిలో తొమ్మిది మంది ఇరవై ఏళ్ల లోపు నవ యువకులే కావడం. తోపులాటలో 50 మంది వరకు తీవ్రంగా గాయపడగా, 400 మంది ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారన్నది కర్ణాటక ప్రభుత్వ లెక్క. ఈ సంఘటనపై సర్కారు మెజిస్టేరియల్ ఎంక్వయిరీకి ఆదేశించింది. నగర పోలీస్ కమిషనర్ సహా కొందరు కీలక అధికారులను సస్పెండ్ చేసింది. సిఎం సిద్దరామయ్య రాజకీయ కార్యదర్శిపై కూడా వేటు పడింది. ఇంటిలిజెన్స్ చీఫ్‌తో పాటు పలువురు కీలక పోలీసు అధికారులను బదిలీ చేసినట్లు వార్తలు వస్తున్నాయి. ఆర్‌సిబి, రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్, ఈవెంట్ మేనేజ్‌మెంట్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేసి కొందరిని అరెస్టులు చేసింది. బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా, పరిహారాలు సరేసరి.

తొక్కిసలాట దృశ్యాలను చూస్తే నిర్వహణ, భద్రతా వైఫల్యాలు, నిఘా లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ఘటన తీవ్రత రీత్యా రాష్ట్ర హైకోర్టు సైతం సూమోటోగా స్వీకరించి గురువారం తక్షణ విచారణ ప్రారంభించి సంధించిన ప్రశ్నలు ఈవెంట్ నిర్వహణలో లోపాలను ప్రాథమికంగా నిర్ధారించేవిగా ఉన్నాయి. వాటిలో కొన్నింటిని రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. ఈ నెల 10 కల్లా సమగ్ర నివేదిక ఇవ్వాలని ప్రభుత్వాన్ని న్యాయస్థానం అదేశించింది. అసలు ఎవరు ఆర్‌సిబి బృందాన్ని సన్మానించాలనుకున్నారో తెలియాలి. మంగళవారం రాత్రి అహ్మదాబాద్‌లో మ్యాచ్ ముగియగా ఆర్‌సిబి ప్లేయర్స్ టీం మర్నాడు మధ్యాహ్నం 2.45 గంటలకల్లా బెంగళూరుకు తరలి వెళ్లింది. విధాన సౌధలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున గవర్నర్, ముఖ్యమంత్రి, డిప్యూటి సిఎం టీంను సన్మానించారు. సాయంత్రం ఆరుగంటలకు చిన్నస్వామి స్టేడియంలో ప్రజల సమక్షంలో విజయోత్సవాలకు ప్లాన్ జరిగింది. విధాన సౌధకు సదరు స్టేడియం అర కిలోమీటరు దూరం ఉంటుందంతే. స్టేడియం కెపాసిటీ 35 వేలు కాగా స్టేడియం వెలుపల మూడు లక్షల మంది వరకు చేరారని అంచనా. లోపల విజయోత్సవాలు జరుగుతున్న సమయంలోనే బయట జనం హాహాకారాలు మిన్నంటాయి. అంత మంది వస్తారని ఊహించలేదని ప్రభుత్వం, నిర్వాహకులు చెప్పడం నప్పదు. జనాల, అభిమానుల భావోద్వేగాలను అంచనా వేసి ఆ మేరకు ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిది, నిర్వాహకులది. కనీసం ఫస్ట్ ఎయిడ్ కూడా కొన్ని గంటలపాటు లభించలేదంటున్న బాధితుల అచేతన స్థితినిబట్టే అక్కడి సౌకర్యాలను దౌర్భాగ్యమేంటో ఊహించవచ్చు.

నయా ఉదారవాద విధానాల పర్యవసానంగా వచ్చింది ఐపిఎల్. ఫక్తు వ్యాపార క్రీడ. రానురాను స్పాన్సర్స్, దిగ్గజ కంపెనీల జోక్యానికి హద్దు పద్దు లేకుండా పోయింది. తమకు నచ్చిన ఆటగాళ్లను కొనుక్కొని టీంలు చేసి ఆడించడం, దీనిపై వందల వేల కోట్ల రూపాయల వ్యాపారం జరగడం గ్యాంబ్లింగ్‌ను తలపిస్తుంది. నీతి నియమాలు క్రీడా స్ఫూర్తి మచ్చుకైనా కనిపించవు. కనిపించేదంతా వ్యాపారం, లాభాలు, జూదమే. ఐపిఎల్ మ్యాచ్‌లకు కల్పించే ప్రచారం అంతా ఇంతా కాదు. యువత ఆ వైపు ఆకర్షితమవుతోంది. వారి భావోద్వేగాలను కంపెనీలు ఎంచక్కా క్యాష్ చేసుకుంటున్నాయి. ఆ ధోరణే ఛాంపియన్ సాధించిన ఆర్‌సిబి టీంను తక్షణం సన్మానించాలన్న, విజయోత్సవాలు నిర్వహించాలన్న లక్ష్యానికి హేతువుగా ఉంది. ఈ హడావుడే కనీస ఏర్పాట్లు, భద్రతాచర్యలు చేపట్టనీకుండా చేశాయి. వేడిలో వేడిగా విజయోత్సవాలపైనా నాలుగు కాసులు సంపాదించుకునే రంధి ఒక్కటే కనిపిస్తుంది. చిన్నస్వామి స్టేడియం వద్ద తొక్కిసలాట మరణాలకు ఈవెంట్ మేనేజ్‌మెంట్, ఆర్‌సిబి, రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలి. బాధ్యులైన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలి. భవిష్యత్తులో ఇటువంటివి పునరావృతం కాకుండా స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్‌ను రూపొందించి అమలు చేయాలి.

# పల్లాను ఫోన్‌లో పరామర్శించిన సీఎం చంద్రబాబు

- **టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు పితృవియోగం**
- **పల్లా తండ్రి, మాజీ శాసనసభ్యుడు సింహాచలం కన్నుమూత**
- **తీవ్ర విచారం వ్యక్తం చేసిన సీఎం చంద్రబాబు**
- **సింహాచలం సేవలను స్మరించుకున్న ముఖ్యమంత్రి**
- **కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి**



తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఇంట విషాదం నెలకొంది. ఆయన తండ్రి, మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం శనివారం కన్నుమూశారు. ఈ వార్త తెలియగానే ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన పల్లా శ్రీనివాసరావుకు ఫోన్ చేసి పరామర్శించారు. సింహాచలం మరణం పట్ల విచారం వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా పల్లా సింహాచలం అందించిన సేవలను చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. పల్లా సింహాచలం మృతి పట్ల రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కేఎస్ జవహర్ కూడా తీవ్ర విచారం వ్యక్తం చేశారు. "తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు గారి తండ్రి, మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం గారి మృతి తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది" అని పేర్కొన్నారు. సింహాచలం గారు ఎమ్మెల్యేగా ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం చేసిన కృషి మరువలేనిదని జవహర్ కొనియాడారు. "ఉత్తరాంధ్ర ప్రజల హృదయాల్లో నిలిచిన వ్యక్తి సింహాచలం గారు. పల్లా శ్రీనివాసరావు గారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. సింహాచలం గారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నాను" అని జవహర్ తన సంతాప సందేశంలో పేర్కొన్నారు.

# భారత్‌లో పేదరికంపై ప్రపంచ బ్యాంకు ఆసక్తికర రిపోర్టు

- **గత దశాబ్దంలో భారత్‌లో తీవ్ర పేదరికం భారీగా తగ్గుదల**
- **2011-12లో 27.1% నుంచి 2022-23 నాటికి 5.3 శాతానికి పడిపోయిన పేదరికపు రేటు**
- **సుమారు 11 ఏళ్లలో 26.9 కోట్ల మందికి తీవ్ర పేదరికం నుంచి విముక్తి**
- **ప్రపంచ బ్యాంకు తాజా గణాంకాలలో వెల్లడైన కీలక అంశాలు**
- **ప్రధాని మోదీ ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పేదరిక నిర్మూలనలో గణనీయ పురోగతి**
- **బహుముఖ పేదరిక సూచీ కూడా 2022-23 నాటికి 15.5 శాతానికి తగ్గుదల**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వ పాలనలో గత దశాబ్ద కాలంలో భారతదేశం తీవ్ర పేదరికాన్ని తగ్గించడంలో కీలక పురోగతి సాధించింది. ప్రపంచ బ్యాంకు తాజాగా విడుదల చేసిన గణాంకాల ప్రకారం, 2011-12లో 27.1 శాతంగా ఉన్న తీవ్ర పేదరికపు రేటు 2022-23 నాటికి 5.3 శాతానికి పడిపోయింది. ఈ గణాంకాలు దేశ ఆర్థిక ప్రగతికి, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ఫలాలకు అద్దం పడుతున్నాయి. వివరాల్లోకి వెళితే, 2011-12 సంవత్సరంలో దేశంలో 34.47 కోట్ల మంది ప్రజలు తీవ్ర పేదరికంలో జీవించగా, 2022-23 నాటికి ఈ సంఖ్య 7.52 కోట్లకు గణనీయంగా తగ్గింది. అంటే, సుమారు 11 సంవత్సరాల వ్యవధిలో దాదాపు 26.9 కోట్ల మంది భారతీయులు తీవ్ర పేదరికం నుంచి బయటపడ్డారని ప్రపంచ బ్యాంకు నివేదిక స్పష్టం చేస్తోంది. ఈ మార్పు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సమానంగా కనిపించడం గమనార్హం. 2011-12లో 16.2 శాతంగా ఉన్న తీవ్ర పేదరికంలో ఉన్న భారతీయుల వాటా, 2022-23 నాటికి 2.3 శాతానికి దిగివచ్చింది. ఈ లెక్కన, 2.15 డాలర్ల పేదరిక రేఖకు దిగువన ఉన్న వారి సంఖ్య 2011లో 20.59 కోట్లు ఉండగా, 2022 నాటికి 3.36 కోట్లకు తగ్గింది. గ్రామీణ ప్రాంతాల్లో తీవ్ర పేదరికం 18.4 శాతం నుంచి 2.8 శాతానికి తగ్గగా, పట్టణ ప్రాంతాల్లో ఇది 10.7 శాతం నుంచి 1.1 శాతానికి పడిపోయిందని గణాంకాలు వివరిస్తున్నాయి. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు 2011-12లో దేశంలోని మొత్తం నిరుపేదల్లో 65 శాతం వాటాను కలిగి ఉండగా, 2022-23 నాటికి తీవ్ర పేదరికం తగ్గుదలలో ఈ రాష్ట్రాలు మూడింట రెండు వంతుల పాత్ర పోషించాయి. తీవ్ర పేదరికంతో పాటు, బహుముఖ పేదరికాన్ని తగ్గించడంలో కూడా భారత్ విశేషమైన ప్రగతిని కనబరిచింది. బహుముఖ పేదరిక సూచీ (ఎంపీఐ) 2005-06లో 53.8 శాతం



ఉండగా, 2019-21 నాటికి 16.4 శాతానికి, ఆపై 2022-23 నాటికి 15.5 శాతానికి తగ్గిందని తాజా సమాచారం తెలియజేస్తోంది. కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం 11 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న తరుణంలో, పేదరిక నిర్మూలనకు, ప్రజల సాధికారత, మౌలిక సదుపాయాలు, సమ్మిళిత వృద్ధికి కేంద్రం తీసుకున్న విప్లవాత్మక చర్యలను ప్రధాని మోదీ పలు సందర్భాల్లో ప్రస్తావించారు. పీఎం ఆవాస్ యోజన, పీఎం ఉజ్వల యోజన, జన్ ధన్ యోజన, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాలు గృహ, స్వచ్ఛమైన వంట ఇంధనం, బ్యాంకింగ్, ఆరోగ్య సంరక్షణ సేవలను ప్రజలకు మరింత అందుబాటులోకి తెచ్చాయి. ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ), డిజిటల్ సమ్మిళితత్వం, పటిష్టమైన గ్రామీణ మౌలిక సదుపాయాలు పారదర్శకతను పెంచి, లబ్ధిదారులకు ప్రయోజనాలను వేగంగా చేరవేయడంలో దోహదపడ్డాయని, తద్వారా 25 కోట్లకు పైగా ప్రజలు పేదరికాన్ని జయించడంలో సహాయపడ్డాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## రేవంత్ కేబినెట్ విస్తరణకు రంగం సిద్ధం!..

కేటాయింపుపై పార్టీలో అంతర్గత కసరత్తు వేగవంతమైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయంపై సీనియర్ నాయకులతో చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌తో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చర్చలు జరిపారు. అధిష్ఠానం నుంచి సూత్రప్రాయంగా అనుమతి లభించడంతో, మంత్రివర్గంలోకి ఎవరిని తీసుకోవాలనే దానిపై ముఖ్యమంత్రి తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. మంత్రివర్గ విస్తరణకు పార్టీ అధిష్ఠానం ఆమోదం తెలపడంతో ఆశావహులు తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అన్నారు. ఈ దిశగా, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ చొరవతో, ప్రపంచ ప్రఖ్యాత టెక్నాలజీ సంస్థ ఎన్విడియాతో ఒక అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ ఒప్పందం ద్వారా రాష్ట్రంలో ఏఐ ఆధారిత అభివృద్ధికి పటిష్టమైన పునాది వేస్తున్నామని. విద్య, నైపుణ్యాభివృద్ధి నుంచి పరిశోధన, ఆవిష్కరణల వరకు ప్రతి అంశంలోనూ ఈ భాగస్వామ్యం కీలకం కానుందని స్పష్టం చేశారు.

## కాగ్ లెక్కలతో రాష్ట్ర ఆర్థిక దుస్థితి బట్టబయలైంది: జగన్

తేటతెల్లం చేశాయి. ఈ ఆర్థిక సంవత్సరం తొలి నెలలోనే, అంటే 2025 ఏప్రిల్ లో, రాష్ట్ర జీఎస్టీ ఆదాయాలు 2024 ఏప్రిల్ తో పోలిస్తే ఏకంగా 24.20% మేర తగ్గుదల చూపించాయి. కాగ్ గణాంకాలు బహిర్గతమైన వెంటనే, ప్రభుత్వం మరోసారి మే నెలలో కూడా జీఎస్టీ ఆదాయాలు రికార్డు స్థాయిలో ఉన్నాయని పేర్కొంటూ ఒక కుట్రపూరితమైన ప్రకటన విడుదల చేసింది. ఈ ప్రకటనలో, 2025 ఏప్రిల్ లో కేంద్ర ప్రభుత్వం ఐజీఎస్టీ నుంచి ముందస్తు కేటాయింపుల సర్దుబాటు కింద రూ. 796 కోట్లు మినహాయించుకుందని, అందుకే జీఎస్టీ ఆదాయాలు తగ్గాయని పేర్కొంది. వాస్తవానికి, ఐజీఎస్టీ ముందస్తు కేటాయింపు అనేది ప్రభుత్వ ఖాతాల్లోని మేజర్ హెడ్ 0006 కింద మైనర్ హెడ్ 110 పరిధిలోకి వస్తుంది. ఇది ఒక సాధారణ ప్రక్రియ. అన్ని సర్దుబాట్లను లెక్కించిన తర్వాతే నికర జీఎస్టీ ఆదాయాలు నిర్ధారిస్తారు. గత సంవత్సరాల్లో కూడా ఇదే పద్ధతి కొనసాగింది. మే 1వ తేదీ ప్రకటనలో 2025 ఏప్రిల్ నికర జీఎస్టీ వసూళ్లు రూ. 3,354 కోట్లు అని చెప్పిన ప్రభుత్వం, ఇప్పుడు రూ. 796 కోట్లు సర్దుబాటు అయ్యాయని చెప్పడం, కాగ్ ద్వారా జీఎస్టీ ఆదాయాల గురించిన నిజం బయటపడిన తర్వాత దాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నమేనని స్పష్టంగా అర్థమవుతోంది.

**పన్ను, పన్నేతర ఆదాయాల్లోనూ భారీ క్షీణత**

టీడీపీ ప్రభుత్వం చెబుతున్న దానికి పూర్తి విరుద్ధంగా, కాగ్ విడుదల చేసిన గణాంకాలు ఈ ఆర్థిక సంవత్సరం తొలి నెలలోనే ఆర్థిక మందగమనం మరింత స్పష్టంగా కనిపిస్తోందని సూచిస్తున్నాయి. 2024 ఏప్రిల్ తో పోలిస్తే పన్ను ఆదాయాలు 12.21%, పన్నేతర ఆదాయాలు 22.01% మేర తగ్గుదల నమోదు చేశాయి. రాష్ట్ర సొంత ఆదాయాలను పరిగణనలోకి తీసుకుంటే, గత ఏడాదితో పోలిస్తే తగ్గుదల 12.76%గా ఉంది. ఈ గణాంకాలు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అత్యంత నిరాశాజనకంగా ఉందని స్పష్టం చేస్తున్నాయి. ప్రభుత్వం వాస్తవాలను దాచిపెట్టి, అబద్ధపు ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని ఈ లెక్కలు తేటతెల్లం చేస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం వాస్తవాలను అంగీకరించి, ఆర్థిక క్రమశిక్షణ దిశగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది... అంటూ జగన్ ట్వీట్ చేశారు.

## జగన్‌కు మంత్రి నారా లోకేశ్ స్ట్రాంగ్ వార్నింగ్

అవమానించారని, ఇది ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమని మండిపడ్డారు. సాక్షి చానల్ లో వచ్చిన చర్చా కార్యక్రమంలో ఓ వ్యక్తి అమరావతి మహిళలపై అత్యంత అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడంపై నారా లోకేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో నారా లోకేశ్ స్పందిస్తూ, "జగన్ గారూ! మహిళలను ఇంత దారుణంగా మీ మీడియా ద్వారా అవమానించడం సమంజసమేనా? తల్లుల ఆత్మగౌరవాన్ని, అమరావతిని ద్వేషిస్తూ మీరు చేస్తున్న అసత్య ప్రచారం మీ పతనానికి పరాకాష్ఠ. ఆకాశం మీద ఉమ్మేయాలని ప్రయత్నిస్తే అది మీ ముఖం మీదే పడుతుంది. అమరావతిపై విషం చిమ్మాలని చూస్తే, అది తిరిగి మీ తాడేపల్లి ప్యాలెస్‌కే చేరుతుంది" అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అమరావతి కచ్చితంగా దేవతలు కొలువైన రాజధాని అని లోకేశ్ పునరుద్ఘాటించారు. "భూములు త్యాగం చేసిన తల్లుల అమరావతి ఇది. మూడు రాజధానుల పేరుతో కుట్రలు చేస్తుంటే, 'జై అమరావతి' అని నినదించిన శాంతమూర్తుల పవిత్ర స్థలం మన రాజధాని. జగన్ అనే సైతాన్‌ను తరిమికొట్టిన అన్ని మతాల దేవుళ్లు, దేవతలు కొలువైన ప్రాంతం అమరావతి. కన్నతల్లిని, సొంత చెల్లిని ఇంటి నుంచి పంపించేసిన దుర్మార్గుడికి మహిళల త్యాగాలు, వారి గొప్పతనం ఎలా అర్థమవుతుంది?" అని లోకేశ్ ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మహిళల భద్రత, గౌరవం విషయంలో అత్యంత కఠినంగా వ్యవహరిస్తారని లోకేశ్ గుర్తుచేశారు. "మహిళల జోలికి వచ్చినా, ఆడపిల్లలను వేధించినా, అఘాయిత్యాలకు పాల్పడినా వారికి అదే ఆఖరి రోజని మా ముఖ్యమంత్రి చంద్రబాబు గారు అనేకసార్లు హెచ్చరించారు. విద్యార్థి దశ నుంచే మహిళలను గౌరవించడం నేర్పిస్తున్నాం. మహిళల ఆత్మవిశ్వాసం దెబ్బతినేలా మాట్లాడిన వారిని చట్టప్రకారం శిక్షిస్తున్నాం" అని తెలిపారు. అమరావతిపై విషం చిమ్మేందుకు మహిళా లోకాన్ని కించపరిచిన జగన్ రెడ్డి గారి బృందాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ క్షమించబోమని లోకేశ్ స్పష్టం చేశారు. మహిళలను కించపరిచేలా "చీర, గాజులు పెడతాం", "ఆడపిల్లలా ఏడవద్దు", "మేమేమీ గాజులు తొడుక్కోలేదు" వంటి వ్యాఖ్యలు ఎవరు చేసినా కూటమి ప్రభుత్వం ఉపేక్షించదని ఆయన హెచ్చరించారు. రాష్ట్ర మహిళలను అవమానపరుస్తూ క్షమించరాని నేరానికి పాల్పడిన జగన్ రెడ్డి గారు తక్షణమే, బేషరతుగా మహిళా లోకానికి క్షమాపణ చెప్పాలని లోకేశ్ డిమాండ్ చేశారు. "లేకపోతే, రాష్ట్రంలో మహిళలను హింసించే మందుల్లేని మహమ్మారితో బాధపడుతున్న జగన్ మాయ రోగాన్ని పూర్తిగా నయం చేస్తాం. దేవతల రాజధాని అమరావతి... దెయ్యంలాంటి జగన్‌కు తగిన శాస్తి చేస్తుంది" అంటూ లోకేశ్ తీవ్ర స్వరంతో హెచ్చరించారు.

## ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్

సోదరీమణులకు 'ఈద్ ముబారక్' అని వారు పేర్కొన్నారు. త్యాగ బుద్ధిని, నిజమైన భక్తిప్రపత్తులు కలిగి ఉన్నవారే దైవకృపకు పాత్రులు అవుతారనే సూక్తిని బక్రీద్ మనకు తెలియజేస్తుందని తెలిపారు. నేటి ఆధునిక కాలంలో సాటి మనిషిని ప్రేమించేవారే నిజమైన దైవభక్తులుగా చెప్పవచ్చునని ముఖ్యమంత్రి అన్నారు. హజ్రత్ ఇబ్రహీం స్ఫూర్తితో అందరూ సాటివారిని ఆదరిస్తూ సహృదయంతో ముందుకు సాగాలని 'బక్రీద్' సందర్భంగా ఆకాంక్షించారు. త్యాగం, అనురాగం, దాన గుణాలను పెంపొందించే పండుగ ఈద్ అల్ అదా (బక్రీద్) అని, ఈ సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. నిస్వార్థమైన ఆత్మీయ అనుబంధాలను వ్యాపింపజేయడమే బక్రీద్ పండుగ ముఖ్యోద్దేశమని ఆయన అన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా ప్రవక్త ఇబ్రహీం త్యాగ నిరతిని స్మరించుకుందామని లోకేశ్ పిలుపునిచ్చారు.

## ఏడు రోజుల్లో కోటి మందికి పైగా రేషన్ సరఫరా...

పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన పౌర సరఫరా విధానంలో భాగంగా జూన్ 1వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా 29,796 చౌక ధరల దుకాణాల ద్వారా 1,46,21,232 మంది రేషన్ కార్డుదారులకు సరుకుల పంపిణీ ప్రారంభమైంది. ఈ ఏడు రోజుల వ్యవధిలో 1,05,27,767 మంది కార్డుదారులకు రేషన్ అందజేశామని మంత్రి తెలిపారు. అంటే 72 శాతం మందికి రేషన్ సరుకులు అందజేశామన్నారు. అదేవిధంగా 98,77,670 మంది కార్డుదారులకు పంచదార పంపిణీ చేశామని, ఇది 67.56 శాతమని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. 5 సంవత్సరాల పైబడిన వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా ఇంటి వద్దకే సరుకులు అందించే సేవను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఇప్పటివరకు 11,05,439 మందికి ఈ విధంగా పంపిణీ చేసినట్లు వెల్లడించారు. రేషన్ తీసుకునే కుటుంబాల సంఖ్యలో గణనీయమైన పెరుగుదల కనిపిస్తుందన్నారు. "ఇంటింటికీ సేవ" లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రతి నెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు లబ్ధిదారులు ఉదయం నుంచి సాయంత్రం వరకు తమకు అనుకూల సమయాల్లో రేషన్ సరుకులు తీసుకునే వెసులుబాటు కల్పించామని తెలిపారు. రేషన్ షాపుల్లో వినియోగదారుల కోసం మరింత సౌకర్యవంతమైన వ్యవస్థను ఏర్పాటు చేశామని, గతంలో ఉన్న పాత రేషన్ విధానాన్ని తిరిగి ప్రవేశపెట్టామని గుర్తు చేశారు. సరఫరా వ్యవస్థలో పొరపాట్లకు తావు లేకుండా, సేవా దృక్పథంతో డీలర్లు పనిచేయాలని సూచించారు. పారదర్శకంగా, బాధ్యతతో, ప్రజల సౌకర్యం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు.

# ఆక్సియం మిషన్ 4 ప్రయోగానికి సర్వం సిద్ధం

- అంతరిక్ష యాన కొత్త చరిత్రకు అడుగుదూరంలో భారత్
- భారత్ అస్ట్రోనాట్ శుభాంశు శుక్లా తొలి ప్రయాణం
- స్పేస్ స్టేషన్ లో ప్రయోగాలు చేయనున్న రెండో భారతీయుడు
- 1984లో రాకేశ్ శర్మకు తొలి అవకాశం
- తిరిగి 41 ఏళ్ల తర్వాత మరో భారత అస్ట్రోనాట్ నింగిలోకి
- ఈ నెల 10 వ తేది సాయత్రం 5.52 కి ఏఎక్స్-4రాకెట్ ప్రయోగం
- అమెరికాలోని నాసా కెన్నడీ స్పేస్ సెంటర్ నుంచి అంతరిక్షంలోకి
- ఇప్పటికే రాకేట్ లోకి నలుగురు అస్ట్రోనాట్స్
- ప్రయోగానికి కొనసాగుతున్న కౌంట్ డౌన్
- భారత ప్రజల ఆశలను , కలలను అంతరిక్షంలోకి తీసుకెళుతున్న శుక్లా

బెంగళూరు – భారత అంతరిక్ష ప్రయాణం మరో మైలురాయిని దాటనుంది. గత పాతికేళ్లలో ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్‌కు 270 మందికి పైగా వ్యోమగాములు వెళ్లారు. కానీ వారిలో భారతీయులు ఒక్కరు కూడా లేరు. ఆ ఘనత శుభాంశు శుక్లా సాధించబోతున్నారు. ఆనాటి సోవియెట్ యూనియన్ సహకారంతో 1984లో సోయూజ్ వ్యోమనౌకలో అంతరిక్షంలోకి వెళ్లిన తొలి భారతీయుడు రాకేశ్ శర్మ. ఆ తర్వాత కల్పనా చావ్లా, సునీత విలియమ్స్ అంతరిక్షంలోకి వెళ్లినా, వారు భారతీయ సంతతివారే తప్ప, భారత్‌లో పుట్టి పెరిగిన వ్యక్తులెవరూ అంతరిక్షంలోకి వెళ్లలేదు. కానీ, ఇప్పుడు నాలుగు దశాబ్దాల తర్వాత ఈ ఘనత సాధించనున్న రెండో వ్యక్తిగా, అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళుతున్న తొలి భారతీయుడిగా శుభాంశు శుక్లా నిలవనున్నారు. ఆక్సియం 4 మిషన్‌లో భారత వ్యోమగామి శుభాంశు శుక్లా 2025 జూన్10న భారత కాలమానం ప్రకారం సాయంత్రం 5గంటల 52 నిమిషాలకు ఫ్లోరిడాలోని నాసా కెన్నడీ స్పేస్ సెంటర్ నుంచి ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్‌కు వెళ్లబోతున్నారు.

కాగా, చరిత్రాత్మకమైన అంతరిక్షయాత్ర 'ఆక్సియం మిషన్ 4' (ఏఎక్స్-4)కు పైలట్‌గా భారత వైమానికదళానికి చెందిన గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా వ్యవహరించబోతున్నారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో రెండు వారాలు ఉండేందుకు వెళ్లనున్న నలుగురు సభ్యుల బృందంలో శుక్లా ఒకరు. అంతరిక్షంలోకి వెళుతున్న రెండో భారతీయుడిగా, ఐఎస్ఎస్‌లో అడుగుపెడుతున్న తొలి భారతీయుడిగా ఘనత సాధించనున్నారు. దీంతో ఈ యాత్రపై భారతదేశమంతటా ఆసక్తి నెలకొంది. భారతీయ కాలమానం ప్రకారం ఈనెల 10వ తేదీ సాయంత్రం 5:52 గంటలకు నాసాకు చెందిన ఫ్లోరిడాలోని కెన్నడీ అంతరిక్ష కేంద్రం నుంచి ఏఎక్స్-4 ఐఎస్-ఎస్ దిశగా నింగిలోకి వెళ్లనుంది. ఏఎక్స్-4లో ప్రయాణించనున్న బృందానికి నాసా మాజీ ఆస్ట్రోనాట్ పెగ్గీ విట్సన్ నాయకత్వం వహిస్తున్నారు. వందలాది రోజులు అంతరిక్షంలో గడిపిన అనుభవం ఉన్న ఆయన%ా% పది సార్లు స్పేస్ వాక్ చేశారు ఈ బృందంలో మిగతా ఇద్దరు వ్యోమగాములు పోలండ్‌కు చెందిన స్లావోజ్ ఆజ్నాన్స్కీ-విజ్నియాస్కీ, హంగేరీకి చెందిన టైబర్ కాపు. శుక్లా మాదిరిగానే వారు కూడా తమ దేశాల తరపున నాలుగు దశాబ్దాల తర్వాత అంతరిక్షంలో అడుగు పెడుతున్నారు. ఈ యాత్రలో పైలట్‌గా శుక్లా పాత్ర చాలా కీలకమని నిపుణులు చెబుతున్న మాట. లాంచ్, డాకింగ్, అన్‌డాకింగ్ సమయంలో వ్యోమనౌకను నిర్వహించడం, తిరిగి భూమి మీదకు తీసుకురావడంలో మిషన్ కమాండర్‌కు శుక్లా సెకండ్-ఇన్-కమాండ్‌గా వ్యవహరిస్తారు. ఈ నలుగురు వ్యోమగాముల బృందం మొత్తం 60 ప్రయోగాలు చేయనున్నారు. వాటిలో ఏడు భారతదేశం ప్రతిపాదించినవి ఉననాయి. అంతరిక్షం గురించి మరింత లోతుగా అర్థం చేసుకోవడానికి, జీవశాస్త్రం, సూక్ష్మ గురుత్వాకర్షణశక్తిపై దాని ప్రభావాన్ని అధ్యయనం చేయడానికి ఇస్రో ప్రయోగాలు ఉపయోగపడతాయని నాసా మాజీ శాస్త్రవేత్త మిలా మిత్ర చెప్పారు. ఆరు రకాల పంటల విత్తనాలపై స్పేస్ ఫ్లయిట్ ప్రభావం ఏమిటనేదీ అధ్యయనం చేయడం కీలక ప్రయోగాలలో ఒకటన్నారు. భవిష్యత్తు పరిశోధనా లక్ష్యమైన అంతరిక్షంలో పంటలు ఏవిధంగా పెరుగుతాయో అవగాహన చేసుకోవడానికి ఉపయోగపడటమే ఈ ప్రాజెక్టు లక్ష్యమని వివరించారు. ఆహారం, ఇంధనంగానే కాకుండా లైఫ్ సపోర్టింగ్ సిస్టమ్‌గానూ ఉపయోగించడానికి మూడు రకాల సూక్ష్మ శైవలాల జాతులు అభివృద్ధికి సంబంధించి మరో ప్రయోగం చేయనున్నారు. సూక్ష్మ గురుత్వాకర్షణ శక్తిలోనూ పెరగగలిగే ఒక దాన్ని గుర్తించడానికి అది ఉపయోగపడుతుందని మిత్ర చెప్పారు.



**ప్రయాణానికి సిద్ధంగా..**

అంతరిక్ష ప్రయాణ సన్నాహాల్లో భాగంగా నలుగురు వ్యోమగాములు మే 25వ తేదీ నుంచి ప్రత్యేక పర్యవేక్షణ (క్వారంటైన్)లో ఉన్నారు. గత రాత్రి మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. తెల్లని చిన్న హంస బొమ్మ ను అక్కడ చూపించారు. ఏఎక్స్-4లో ప్రయాణించే తమ బృందంలో అది ఐదవ సభ్యురాలు కాబోతోందని వారు చమత్కరించారు. మేం అన్నిరకాల శిక్షణను పూర్తి చేశాం. లాంచ్‌కు సిద్ధమయ్యాం. మా బృందం చక్కగా కలిసింది అని కమాండర్ విట్సన్ చెప్పారు.

**భారతీయుల ఆశలు, కలలను ..**

భారతీయుల ఆశలు, కలలను మోసుకెళ్తున్నానని, తన ఉత్సాహాన్ని మాటల్లో చెప్పలేనని గ్రూప్ కెప్టెన్ శుక్లా అన్నారు. ఇప్పటివరకూ ఇదొక అద్భుతమైన ప్రయాణం. అంత ఉన్నతమైనది ఇప్పటివరకూ లేదు అని ఆయన చెప్పారు. నేను అంతరిక్షంలోకి వెళుతున్నాను. నేను తీసుకెళుతున్నవి కేవలం యంత్రాలు, పరికరాలు మాత్రమే కాదు. వంద కోట్ల మంది హృదయాల ఆశలు, కలలు అని శుక్లా వ్యాఖ్యానించారు. ఈ మిషన్ విజయవంతమవ్వాలని భారతీయులంతా ప్రార్థన చేయాలని కోరుతున్నాను అని అన్నారు.

**గగన్‌యాన్ దిశగా..**

నిర్ణీత షెడ్యూల్ ప్రకారం 2027లో ప్రయోగించనున్న దేశ తొలి మానవ సహిత స్పేస్ ఫ్లయిట్‌లో వెళ్లేందుకు గత ఏడాది ఎంపిక చేసిన నలుగురు భారత వైమానిక దళ అధికారులలో 39 ఏళ్ల శుభాంశు శుక్లా ఒకరు. ముగ్గురు వ్యోమగాములను 400 కిలోమీటర్ల కక్ష్యలోకి పంపించి, మూడు రోజుల తర్వాత వెనక్కి తీసుకురావాలన్నది గగన్‌యాన్ మిషన్ లక్ష్యం. 2035 నాటికల్లా ఒక అంతరిక్ష కేంద్రాన్ని ఏర్పాటుచేయడం, 2040లో చంద్రుడిపైకి ఒక వ్యోమగామిని పంపడం అనే ప్రతిష్టాత్మక లక్ష్యాలను భారతదేశం ఇప్పటికే వెల్లడించింది. గగన్‌యాన్‌కు సన్నద్ధతలో భాగంగా భారత అంతరిక్ష సంస్థ ఇస్రో చాలా పరీక్షలు నిర్వహిస్తోంది. అందులో భాగంగానే మహిళ రూపంలోని రోబోను అంతరిక్షంలోకి పంపడానికి సన్నాహాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో వారాంతంలోని ఏఎక్స్-4 మిషన్ ఇస్రోకు అత్యంత ఉత్తేజకరమైన అవకాశమని, ఇది భారతదేశమంతటా ఎంతో ఉత్సుకతను కలిగిస్తోందని అధికారులు చెప్పారు

**ఆక్సియం స్పేస్ ఆధ్వర్యంలో..**

%స్పేస్ ఎక్స్ ఫాల్కన్ 9 రాకెట్ సాయంతో డ్రాగన్ స్పేస్ క్రాఫ్ట్ ద్వారా ఈ బృందం ఆదివారం అంతరిక్షంలోకి వెళ్లబోతోంది. ఏఎక్స్-4 ఒక వాణిజ్య తరహా స్పేస్ ఫ్లయిట్. దీన్ని హ్యూస్టన్ కేంద్రంగా పనిచేస్తున్న ఆక్సియం స్పేస్ అనే ప్రైవేట్ సంస్థ నిర్వహిస్తోంది. దీనికి నాసా, ఇస్రో, యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ (ఈసా) సహకారం అందిస్తున్నాయి. ఏఎక్స్-4లో శుక్లాను ఐఎస్ఎస్‌కు పంపడానికి, అందుకు అవసరమైన శిక్షణ ఇవ్వడానికి ఇస్రో దాదాపు రూ.507 కోట్లు (59 మిలియన్ డాలర్లు) చెల్లించింది. ఈ యాత్ర ద్వారా ఆయన అనుభవం భారత అంతరిక్ష పరిశోధనలకు అపారంగా ఉపయోగపడుతుందని భావిస్తోంది. ఈ మిషన్ నుంచి మనం పొందే ప్రయోజనం శిక్షణ, సౌకర్యాలపై అవగాహన, అంతరిక్షంలో సంయుక్తంగా నిర్వహిస్తున్న ప్రయోగాల నిర్వహణలో అనుభవపరంగా అసాధారణమైంది అని ఇస్రో చైర్మన్ వి నారాయణన్ ఇటీవల చెప్పారు. గ్రూప్ కెప్టెన్ శుక్లా గత ఏడాది ఆగస్టు నుంచి శిక్షణ పొందుతున్నారని ఇస్రో ప్రాజెక్టు డైరెక్టర్ సుధీశ్ బాలన్ అన్నారు.

# ఇంటర్ అర్హతతో కేంద్ర కొలువులు దక్కించుకునే ఛాన్స్..




**నిరుద్యోగులకు స్టాఫ్ సెలక్షన్ కమిషన్ మరో గుడ్ న్యూస్ చెప్పింది. కేవలం ఇంటర్ అర్హతతో కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాలు, సంస్థలలో..స్టెనోగ్రాఫర్ గ్రేడ్ సి, డి ఉద్యోగాల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతూ నోటిఫికేషన్ విడుదల చేసింది..**

స్టాఫ్ సెలక్షన్ కమిషన్ 2025-26 సంవత్సరానికిగానూ కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాలు, సంస్థలలో.. స్టెనోగ్రాఫర్ గ్రేడ్ సి, డి ఉద్యోగాల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతూ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇంటర్ అర్హతతోపాటు స్టెనోగ్రాఫ్‌సర్టిఫికెట్ ఉన్నవారు ఎవరైనా ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. రాత పరీక్ష, స్కిల్ టెస్ట్ ఆధారంగా తుది ఎంపిక ఉంటుంది. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎస్సెస్సీ స్టెనోగ్రాఫర్ ఎగ్జామినేషన్ 2025 నోటిఫికేషన్ కింద మొత్తం 261 పోస్టులను భర్తీ చేయనున్నారు.

స్టెనోగ్రాఫర్ గ్రేడ్ బీ, డీ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఏదైనా గుర్తింపు పొందిన బోర్డు నుంచి 12వ తరగతిలో ఉత్తీర్ణత పొంది ఉండాలి. అలాగే ఇంగ్లీష్ లేదా హిందీలో స్టెనోగ్రఫీ నైపుణ్యాలు తప్పనిసరిగా ఉండాలి. వయోపరిమితి కింద అభ్యర్థుల వయసు ఆగస్టు 01, 2025 నాటికి 18 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉండాలి. అంటే అభ్యర్థులు తప్పనిసరిగా ఆగస్టు 2, 1995 నుంచి ఆగస్టు 1, 2007 మధ్య జన్మించి ఉండాలి. ఈ అర్హతలున్నవారు ఎవరైనా ఆన్‌లైన్ విధానంలో జూన్ 26, 2025వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చు.దరఖాస్తు ఫీజు కింద జనరల్, ఓబీసీ అభ్యర్థులు రూ.100 చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ఎక్స్‌సర్వీస్‌మెన్, మహిళా అభ్యర్థులకు ఎలాంటి ఫీజు లేదు. రాత పరీక్ష, స్కిల్ టెస్ట్ ఆధారంగా తుది ఎంపిక ఉంటుంది.

**ముఖ్యమైన తేదీలు ఇవే..**

- ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభ తేదీ: జూన్ 6, 2025.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు దరఖాస్తు చివరి తేదీ: జూన్ 26, 2025.
- ఫీజు చెల్లింపుకు చివరి తేదీ: జూన్ 27, 2025.
- దరఖాస్తు సవరణ తేదీలు: జులై 01, 2 తేదీల్లో
- ఆన్‌లైన్ రాత పరీక్ష తేదీలు: ఆగస్టు 06 నుంచి ఆగస్టు 11 వరకు

# అయినవిల్లి తహసీల్దార్‌పై కొడవలితో దాడి

- చేతికి గాయంతో తహసీల్దార్ నాగలక్ష్మమ్మ

**అయినవిల్లి:** కార్యాలయంలో విధుల్లో ఉన్న అయినవిల్లి తహసీల్దార్ నాగలక్ష్మమ్మపై అదే మండలం తొత్తరమూడి శివారు జోగిరాజుపాలేనికి చెందిన మీసాల సత్యనారాయణ అనే వ్యక్తి కొడవలితో దాడిచేసి గాయ పరిచాడు. ఆమె చేతికి గాయమైంది. శుక్రవారం సాయం త్రం జరిగిన ఈ సంఘటనపై కార్యాలయ సిబ్బంది తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సత్యనారాయణ చేతిసంచిలో కొడ'వలి పట్టుకుని నేరుగా కార్యాలయంలోకి వెళ్లి తహసీల్దార్ పైకి విసరడంతో ఆమె చేతికి గాయమైంది. వెంటనే తేరుకున్న సిబ్బంది అతడిని బయటకు లాక్కువచ్చారు. అతడు మద్యం తాగి ఉన్నాడని తెలిపారు. తనకు తొత్తరమూడిలో కొబ్బరితోటలు ఉన్నాయని, వాటిని ఇతరులు ఆక్రమించుకున్నారని, భూపత్రాలు ఇప్పించా లంటూ అమలాపురంలో కలెక్టర్ కార్యాలయం, స్థానిక ఎంపీడీవో, పోలీస్ స్టేషన్, పంచాయతీ కార్యాలయాల చుట్టూ అతను తిరుగుతుంటాడని స్థానికులు తెలిపారు. కొన్నాళ్లుగా మానసిక సమస్యలతో బాధపడుతున్నాడని.. మద్యం సేవించి రహదారిపై కేకలు వేసుకుంటూ వెళ్తుంటాడన్నారు. గతంలో ఓ నేర సంఘటనలోనూ జైలుకు వెళ్లి వచ్చాడన్నారు. అయితే సత్యనారాయణకు గ్రామంలో ఎటువంటి భూములు, భూసంబంధిత సమస్యలు లేవని తహసీల్దార్ నాగలక్ష్మమ్మ తెలిపారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందడంతో నిందితుడిని అరెస్టు చేశారు. తహసీల్దార్‌ను కొత్తపేట ఆర్డీవో శ్రీకర్ పరామర్శించారు.

**కఠిన చర్యలు తీసుకుంటాం: కలెక్టర్**

**అమలాపురం:** తహసీల్దార్‌పై మారణాయుధంతో దాడిచేసిన నిందితుడిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. తహసీల్దార్‌ను ఆయన ఫోన్‌లో పరామర్శించారు. జిల్లా యంత్రాంగం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. దాడికి పాల్పడిన వ్యక్తిపై కఠినమైన సెక్షన్ల ద్వారా కేసు నమోదు చేయాలని ఎస్పీకి సూచించారు.

# కలసి నడిస్తే... కట్టడి చేయొచ్చు!

**మానవాళి ఎదుర్కొంటున్న పెను విపత్తు ఉగ్రవాదం. ఇది నాగరిక సమాజపు అత్యు న్నత విలువలకు మాయని మచ్చ. విప్లవం, బలిదానం, హింసను గొప్పగా చేసి చెప్పడం లాంటి తప్పుడు భావనలు ఉగ్రవాదం పెచ్చ రిల్లడానికి ప్రాతిపదికలవుతున్నాయి. 'ఒక రికి స్వాతంత్ర్య యోధుడైనవాడు మరొకరికి ఉగ్రవాది' అన్న వాదన అతి ప్రమాదకర మైన అపోహ. భయమూ, రక్తపాతాలపై నిజమైన స్వతంత్రాన్ని ఎన్నటికీ నిర్మించలేం.ఉగ్రవాదాన్ని, ఉగ్రవాదులను పెంచుతున్నది భయమే. కానీ, ఆ భయాన్ని వ్యాపింపజేయడంలోనూ ఉగ్రవాదులు విఫలురయ్యారు. 26/11 దాడి, 2001లో భారత పార్లమెంటుపై దాడి, ఇటీవలి పహల్ గామ్ దాడి... ఘటన ఏదయినా, భారత్ దృఢంగా నిలబడింది.**



**ఉగ్రవాదుల దుష్ట పన్నాగం**

పాకిస్తాన్ నుంచి ప్రభుత్వ ప్రాయోజిత సీమాంతర ఉగ్రవాదా నికి దశాబ్దాలుగా మనం బాధితులం. పర్యాటకులను వారి మతమే మిటో అడిగి మరీ చంపేయడాన్ని బట్టి ఉగ్రవాదుల పన్నాగం స్పష్టమవుతోంది. దేశ ఐక్యతకు ముప్పు కలిగించాలన్న దురుద్దేశంతో, వివిధ విశ్వాసాలకు చెందిన పలు ఆధ్యాత్మిక ప్రదేశాలపై పాక్ దాడికి తెగబడటం కూడా ఇలాంటి చర్యే. ఇలాంటి దుర్మార్గపు చర్యలను ఏ మతమూ ఆమోదించదు. ఉగ్రవాదులు వ్యూహాత్మకంగా మతాన్ని దుర్వినియోగం చేస్తూ, తమ ఆటవిక చర్యలకు సమర్థింపుగా దాన్ని వాడుకుంటున్నారు. ఈ మత దుర్వినియోగం ప్రమాదవశాత్తు జరిగినదో, లేదా హఠాత్పరిణా మమో కాదు, ఇది ఉద్దేశపూర్వక పన్నాగం. దురాగతాలకు తప్పుడు సమర్థనలను చెప్పుకునే కుటిల వ్యూహం.

ఉగ్రవాదాన్ని ఎంతమాత్రమూ సహించబోమన్న విధానాన్ని భారత్ స్పష్టం చేసింది. ఉగ్రవాద చర్యలూ, చర్చలూ ఒకేసారి సాధ్యం కావు. భవిష్యత్తులో పాకిస్తాన్ తో జరిగే ఏ చర్చలయినా ఉగ్రవాదం, పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్‌పైనే ప్రధానంగా దృష్టి పెడ తాయి. పాకిస్తాన్ నిజంగా ఉగ్రవాదాన్ని తీవ్రమైనదిగా పరిగణిస్తే ఐక్యరాజ్యసమితి గుర్తించిన హాఫీజ్ సయీద్, మసూద్ అజార్ వంటి ఉగ్రవాదులను అప్పగించాలి.

**పాక్ మూల్యం చెల్లించాలి!**

మనం చాలాకాలంగా దీర్ఘకాలిక దృక్పథంతో, సమర్థమైన వ్యూహాలను అన్వేషిస్తూనే ఉగ్రవాద చర్యలపై ప్రతిస్పందించాం. మన సాయుధ దళాలకు గతంలో రక్షణాత్మక చర్యలకు మాత్రమే అనుమతి ఉండేది. సర్జికల్ స్ట్రైక్స్ (2016), బాలాకోట్ దాడులు (2019), ఇప్పుడు ఆపరేషన్ సిందూర్ (2025)లతో పాక్‌లోని ఉగ్ర వాదులు, ఉగ్రవాద సూత్రధారుల పట్ల తన వైఖరిలో భారత్ సమూల మార్పులు చేసింది.

నైతిక, రాజకీయ అసమ్మతితోపాటు కేవలం రక్షణాత్మక వైఖరి ఇక సరిపోదని ఇప్పుడు తేటతెల్లమైంది. ఏ ఉగ్ర వాద చర్యనైనా ఇకపై యుద్ధ చర్యగానే పరిగణిస్తాం. భారత్‌పై ఏ ఉగ్రవాద దాడి జరిగినా... ప్రభుత్వ ప్రాయోజిత ఉగ్రవాదానికీ ఉగ్రవాదులకూ తేడా లేదనే భావిస్తూ దీటుగా బదులిస్తాం. పాక్ తన గడ్డపై ఉగ్రవాదులను నిలువరించలేకపోతే, ఆ అసమర్థతకు మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది.

ఉగ్రవాదానికి ఆర్థిక చేయూతను నిరోధించడంపై న్యూఢిల్లీలో నిర్వహించిన 'నో మనీ ఫర్ టెర్రర్' మూడో మంత్రివర్గ సదస్సులో ప్రధాని మోదీ, "ఒక్క దాడినీ తేలిగ్గా తీసుకోం, ఒక్క ప్రాణం పోయినా తీవ్రంగా పరిగణిస్తాం. కాబట్టి, ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకలించే వరకు మేము విశ్రమించబోం" అని పునరుద్ఘాటించారు. ఉగ్రవాదాన్ని నిర్మూలించడానికి మనం కట్టుబడి ఉన్నామని ఆప రేషన్ సిందూర్ ద్వారా భారత ప్రభుత్వం, సాయుధ బలగాలు ప్రపంచానికి చాటాయి. స్పష్టమైన, కచ్చితమైన, తీవ్రతరం కాని ఆపరేషన్ ద్వారా, పాకిస్తాన్, పాక్ ఆక్రమిత జమ్మూ%-%కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలను మనం లక్ష్యంగా చేసుకున్నాం. ఉగ్రవాదులపై సైనిక చర్య ఆవశ్యకమనీ, కానీ అదొక్కటే సరి పోదనీ మనకు తెలుసు. పాక్ ఉగ్రవాదాన్ని సాధనంగా ఉపయో గిస్తుండటంతో... ఆ దేశాన్ని దౌత్యపరంగానూ, ఆర్థికంగానూ ఏకాకిని చేయడంలో భారత్ విజయం సాధించింది. పాక్ సీమాంతర ఉగ్రవాదానికి మద్దతివ్వడాన్ని పూర్తిగా మానేసే వరకూ, ఆ దిశగా విశ్వసనీయతను పొందే వరకూ సింధూ జలాల ఒప్పందాన్ని మనం 'నిలిపివేశాం'. ఈ నిర్ణయం పాక్‌పై భారీ ప్రభావాన్ని చూపుతుంది. ఆ దేశం తన 1.6 కోట్ల హెక్టార్ల వ్యవసాయ భూమికి 80%, మొత్తం నీటి వినియోగంలో 93% సింధూనది వ్యవస్థపైనే ఆధారపడుతుంది. అలాగే 23.7 కోట్ల మంది దీనిపై ఆధారపడి ఉండగా, పాక్ జీడీపీలో నాలుగో వంతుకు ఇదే దోహదపడుతోంది.

**ఐదు కీలక చర్యలు!**

ఉగ్రవాదం కేవలం భారత్ సమస్యే కాదు, ఇది ప్రపంచ సమస్య. అంతర్జాతీయ ఉగ్రవాద సూచీ (జీటీఐ) ప్రకారం%-% ఉగ్ర వాద సంఘటనలను ఎదుర్కొంటున్న దేశాల సంఖ్య కొన్నేళ్లుగా పెరిగింది. ఉగ్రవాద వ్యవస్థలను సమర్థంగా నిర్వీర్యం చేయడానికీ, రాబోయే తరాలకు భద్రమైన భవిష్యత్తును అందించడానికీ మనం సమష్టిగా ముందుకు సాగాలి. సూత్రప్రాయమైన, సమగ్రమైన, స్థిరమైన, సమన్వయంతో కూడిన అంతర్జాతీయ వ్యూహాన్ని మనం అవలంబించాలి. ఈ దిశగా అయిదు కీలక చర్యలు తీసుకోవాలి.

**మొదటిది:** 'ఉగ్రవాదం' పదాన్ని నిర్వచించడం. ఉగ్రవాదమంటే ఏమిటన్న దానిపై ఏకాభిప్రాయం లేదు. భారత్ ప్రతిపాదన ఆధారంగా ఐక్యరాజ్యసమితిలో జరిగిన 'అంతర్జాతీయ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా సమగ్ర ఒడంబడిక'లో ఉగ్రవాద నిర్వచనం విషయంలో అతి సమీపంగా వచ్చాం. అర్థపరమైన అంశాలు ఉగ్రవాదంపై పోరా టాన్ని పరిమితం చేయకూడదు. ఉగ్రవాద చర్యల దర్యాప్తునకు లేదా విచారణకు లేదా విదేశాల నుంచి వారిని అప్పగించేందుకు విస్తృతంగా ఆమోదం పొందిన నిర్వచనం అవసరం.

**రెండోది:** ఉగ్రవాద సంస్థలవే కాకుండా ఉగ్రవాదాన్ని ప్రోత్స హిస్తున్న దేశాల ఆర్థిక వనరులను కూడా స్తంభింపజేయాలి. పాక్‌కు ఇచ్చే నిధులు సైనిక%-%ఉగ్రవాద చర్యలు రెండింటితో ప్రపంచాన్ని అస్థిరపరచడానికే దారితీస్తాయనడంలో ఎలాంటి సందేహమూ లేదు. కాబట్టి, పాకిస్తాన్‌ను ఎఫ్ఏటీఎఫ్ తిరిగి గ్రే లిస్టులో చేర్చాల్సిన అవసరముంది.

**మూడోది:** పాకిస్తాన్‌లో ప్రభుత్వ, ప్రభుత్వేతర శక్తులు ఒకే నాణేనికి రెండు పార్శ్వాల వంటివని తెలిసిన విషయమే. ఉగ్రవాదు లకు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు చేయడం, సైనికాధి కారులు యూనిఫామ్‌లో హాజరు కావడం దీన్ని మరింతగా తేట తెల్లం చేస్తోంది. పాకిస్తాన్ లో అణ్వాయుధాలు ప్రభుత్వేతర సంస్థల చేతికి చేరే ప్రమాదం ఎప్పటికైనా ఉంది. అంతర్జాతీయ సమాజం ఈ తీవ్రమైన ప్రమాదాన్ని గుర్తించి, పాక్ అణ్వాయుధాలను అంతర్జా తీయ అణు ఇంధన సంస్థ (ఐఏఈఏ) పర్యవేక్షణలో ఉంచాలి.

**నాలుగోది:** తమ సౌలభ్యం లేదా ప్రయోజనాల ప్రాతిపదికన మాత్రమే ఏ ఉగ్రవాద చర్యలను ఖండించాలో దేశాలు నిర్ణయించుకుంటే%-% అది సమష్టి బాధ్యతను బలహీనపరుస్తుంది. అటువంటి చర్యలకు అది వ్యూహాత్మకమైన సమర్థింపునూ అందిస్తుంది.

**అయిదోది:** కృత్రిమ మేధ, అటానమస్ సిస్టమ్స్, ఆగ్మెంటెడ్ రియాలిటీ, బయోటెక్నాలజీ, నానోటెక్నాలజీ వంటి అధునాతనసాంకేతికతలను కూడా స్వీకరిస్తున్న పాక్‌లోని ఉగ్రవాద స్థావరాలు ప్రపంచమంతటికీ ప్రమాదకరమే. ఈ ముప్పులను అధిగమించడం కోసం అంతర్జాతీయ సహకారం అత్యావశ్యం.

9/11 దాడుల అనంతరం, "ఉగ్రవాదానికి సంబంధించి ఏ సైద్ధాంతిక, రాజకీయ లేదా మతపరమైన సమర్థననైనా మనందృఢంగా ఖండించాలి" అని నాటి భారత ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ ఐక్యరాజ్య సమితి సర్వప్రతినిధి సభలో పేర్కొన్నారు. ఏ రూపంలో ఉన్నా సరే, ఉగ్రవాదాన్ని నిర్మూలించాలన్న సంకల్పానికి భారత్ స్థిరంగా కట్టుబడి ఉంది. శాంతికాముక దేశాలన్నీ మాతో కలిసి రావాలని కోరుతున్నాం.




డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా

తెలుగురాష్ట్రం దినపత్రిక

https://epaper.teluguraastram.com

ఆదివారం 08 జూన్ 2025

## జేఈఈ ర్యాంకర్ తేజకు మంత్రి,కలెక్టర్ అభినందనలు



**ఆలమూరు, జూన్ 7(తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

జాతీయ స్థాయిలో ఎంతో ప్రతిష్టాత్మకంగా జరిగే జేఈఈ అడ్వాన్స్ పరీక్ష ఫలితాల్లో ఆల్ ఇండియా 172 వ ర్యాంకు సాధించిన నాగిరెడ్డి తేజ చంద్ర నారాయణను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్, తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ చిన్న రాముడు,ఆర్డీవొ కృష్ణ నాయక్ తదితరులు సత్కరించి అభినందించారు.ఆలమూరు మండలం చెముదులంక గ్రామానికి చెందిన సన్నకారు రైతు శ్రీనివాస్ కుమారుడు తేజ ఇంత అద్భుతమైన ర్యాంకు సాధించడం పట్ల వారంతా ఆనందం వ్యక్తం చేసారు. కడియపులంక సత్యదేవ నర్సరీలో శనివారం జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో ఈ సత్కారం జరిగింది. ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం మధ్యలోనే కాలేజీ మానేసి ఇంటి వద్దనే చదువుకుంటూ ఈ అద్భుతమైన ఫలితాలు సాధించడం సామాన్య విషయం కాదన్నారు. తేజ అక్క శ్రావణి కూడా జేఈఈ ఫలితాల్లో మెరుగైన ఫలితాలు సాధించి ప్రస్తుతం చెన్నై ఐఐటీలో ఇంజనీరింగ్ చదువుతున్న విషయాన్ని కూడా తెలుసుకుని ఎంతో మందికి ఈ కుటుంబం ఆదర్శంగా నిలుస్తుందన్నారు. తేజ ర్యాంకు సాధించిన విధానాన్ని కలెక్టర్, జాయింట్ కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అదే పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని వారు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో నర్సరీ అసోసియేషన్ అధ్యక్షులు రత్నం అయ్యప్ప, సత్యదేవ నర్సరీ రైతు పుల్లా పెద సత్యనారాయణ, మండల జనసేన పార్టీ అధ్యక్షులు ముద్రగడ జెమ్మీ తదితరులు ఉన్నారు.

## ముగిసిన గ్రంథాలయ వేసవి శిక్షణ తరగతులు





**మలికిపురం జూన్ 7(తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

మలికిపురం మండలం కేశనపల్లి శాఖ గ్రంథాలయ వేసవి శిక్షణ తరగతుల ముగింపు వేడుక ఘనంగా జరిగాయి . ఈ శిక్షణ తరగతులు ఏప్రియల్ 28వ తేదీ నుండి జూన్ 6తేదీ వరకు జరిగాయి.ఈ శిక్షణ తరగతులను పిల్లలు బాగా ఉపయోగించుకున్నారు. ముగింపు వేడుకకు స్థానిక సర్పంచ్ యెనుముల వెంకట నాగు అధ్యక్షత వహించారు. నాగు మాట్లాడుతూ వేసవి సెలవుల్లో పిల్లలు సెల్ ఫోన్ కి ఎడిట్ కాకుండా, కాలయాపన చేయకుండా గ్రంథాలయానికి వచ్చి వివిధ అంశములలో శిక్షణ పొందటం ఆనందదాయకం. పిల్లల సెల్ఫోన్ క్రెడిట్ కాకుండా కాలయాపన చేయకుండా గ్రంథాలయానికి వచ్చి పొందటం ఆనందదాయకం ఈ సందర్భంగా పిల్లలు మాట్లాడుతున్నప్పుడు ఈ శిక్షణ నేర్చుకున్నారు. మాకు బాగా అర్థమైంది ఈ సందర్భంగా ఆపరేషన్స్ హిందువులని స్కిట్ ప్రాక్షలో నాకట్టుకుంది వివిధ అంశాలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో స్థానానికి ఎంపీటీసీ స్థాపించారు పెద్దలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పిల్లలు మాట్లాడుతున్నప్పుడు ఈ శిక్షణ ద్వారా ఏంనేర్చుకున్నారు అనేది మాకు బాగా అర్థమైంది.ఈ సందర్భంగా ఆపరేషన్ సిందూర్ అనే స్కిట్ ప్రేక్షకులను ఆకట్టుకుంది.వివిధ అంశములలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ రాపాక సత్యనారాయణ,గ్రంథాలయ స్థలదాత యర్రంశెట్టి గోపాలకృష్ణ తదితర గ్రామ పెద్దలు పాల్గొన్నారు.గ్రంధాల అధికారి కే. ఇందిరా ఈ వేసవి శిక్షణ తరగతుల్లో జీకే,వ్యాసరచన,డ్రాయింగ్,డాన్స్,స్పోకెన్ ఇంగ్లీష్,కథల పోటీలు, ఆటలు,పాటలు మొదలగు అంశాలలో శిక్షణ ఇచ్చారు.పిల్లలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.గ్రంథాలయాన్ని పిల్లలు పెద్దలు అందరూ ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు.

## ప్రభుత్వ అధికారిపై దౌర్జన్యం చేసిన వ్యక్తులకు జైలు శిక్ష, జరిమానా

**రావులపాలెం, జూన్ 7,(తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ప్రభుత్వ అధికారిపై దౌర్జన్యం చేసి విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తికి, అతని అనుచరులకు కోర్టు 4 జైలుశిక్ష, జరిమానా విధించినట్లు రావులపాలెం టౌన్ సిఐ ఎం. శేఖర్ బాబు తెలిపారు.ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రావులపాలెం మండలం ఊబలంకలో కాలువ పక్కన ఉన్న కొబ్బరి చెట్లను అదే గ్రామానికి చెందిన పడాల రంగారెడ్డి, అతని అనుచరులు ఎటువంటి అనుమతులు లేకుండా అనధికారకంగా కొట్టివేయించినట్లు ఫిర్యాదు రావడంతో 2017 డిసెంబర్ 3వ తేదీన అప్పటి ఆత్రేయపురం ఇరిగేషన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కర్రా రాజమౌళి సదరు వ్యక్తులను ప్రశ్నించగా ఆయనపై రంగారెడ్డి, అతని అనుచరులు దౌర్జన్యం చేసి విధులకు ఆటంకం కలిగించారు. దీనిపై రాజమౌళి పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై సి.హెచ్.విద్యాసాగర్ కేసు నమోదు చేసారు. వాదోపవాదనలు జరిగిన అనంతరం నేరం రుజువు కావడంతో సదరు పడాల రంగారెడ్డి, అతని అనుచరులకు శుక్రవారం కొత్తపేట ఏ.జె.ఎఫ్.సి.ఎం కోర్టు మెజిస్ట్రేట్ బి.జస్వంత్ యాదవ్ సెక్షన్ 248 క్లాస్ టు సీఆర్పీసీ ప్రకారం 4 నెలల జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారని సిఐ తెలిపారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ ఎన్.ఆనందరావు వాదించారని చెప్పారు.

## మందేశ్వర స్వామి వారి ఆదాయం రూ.2.13 లక్షలు





**కొత్తపేట, జూన్ 7, (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

కొత్తపేట మండలం మందపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ మందేశ్వర స్వామి వారి ఆలయానికి శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునుంచే శనిదోష నివారణకు తైలాభిషేకాలు నిర్వహించారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని దేవస్థానం కార్యనిర్వహణాధికారి, ఉప కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసారు. ఈ నేపథ్యంలో తైలాభిషేకాల ద్వారా రూ.1,69,945, అన్న ప్రసాద విరాళాలుగా రూ.43,661 వెరసి రూ.2,13,606 ఆదాయం వచ్చిందని డీసీ చక్రధరరావు తెలిపారు.

## త్యాగనిరతికి నిదర్శనం బక్రీద్.





**కడియం జూన్ 7 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ముస్లిం సోదరులు జరుపుకునే రెండవ అతి పెద్ద పర్వదినం ఈద్-ఉల్-అజా (బక్రీద్)అని, ఈ పండుగ త్యాగనిరతికి నిదర్శనం అని ఈ సందర్భంగా వారందరికీ శుభాకాంక్షలుతెలియజేస్తున్నానని రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు , శ్రీ వీర హనుమాన్ నర్సరీ అధినేత, కడియం మండల మాజీ ఎంపీపీ మార్గాని సత్యనారాయణ పేర్కొన్నారు.అల్లాహ్ ఆజ్ఞ అనుసరించి ఇస్లాంలో ముస్లిం సోదరులు పాటించే త్యాగం, అంకితభావాలకు ప్రత్యక్ష నిదర్శనంగా ఈ పండుగ నిలుస్తుందన్నారు.అల్లాహ్ ఆదేశం ప్రకారం ప్రవక్త హజరత్ ఇబ్రహీం తన పుత్రుడైన ఇస్మాయిల్ ను బలి ఇవ్వటానికి సిద్ధమవుతాడు. ఇబ్రహీం త్యాగనిరతికి అల్లాహ్ పెట్టిన పరీక్షలో కన్నబిడ్డపై ప్రేమ కంటే అల్లాహ్ ఆజ్ఞకే ప్రాధాన్యత ఇచ్చిన ఇబ్రహీం త్యాగనిరతిని మెచ్చిన అల్లాహ్ చిన్నారి ఇస్మాయిల్ స్థానంలో గొర్రెను మార్చి చిన్నారిని తిరిగి తండ్రి ఒడికి చేర్చుతారు. అల్లాహ్ మార్గంలో నడిచే ముస్లింలు పాటించే త్యాగ నిరతికి ప్రత్యక్ష నిదర్శనంగా నిలిచే ఈ బక్రీద్ పర్వదినం ముస్లింల జీవితాల్లో సుఖ సంతోషాలు, ఆనంద ఉత్సాహాలు నింపాలని కోరుకుంటున్నానని ఆయన తెలిపారు.

## సీనియర్ టిడిపి నాయకులు రాజు మృతి

**మలికిపురం జూన్ 7 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు చెల్లింగి శ్రీరామ సుబ్రహ్మణ్య శెట్టి( రాజు) మృతి చెందారు.ఆయన తెలుగుదేశం పార్టీ కి అనేక సేవలందించారు.2019 సంవత్సరం నుంచి ఇప్పటివరకు మలికిపురం మలికిపురం మండలంగుడిమెల్లంక తెలుగుదేశం పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులుగా కొనసాగుతూ ఉన్నారు.గతంలో ఆయన రాజోలు నీటి సంఘానికి డైరెక్టర్ గా,గుడిమెల్లంక శ్రీ ఉమాలక్ష్మనేశ్వర స్వామి దేవస్థానం వైస్ చైర్మన్ పదవులు చేశారు.చెల్లింగి రాజు భౌతిక దేహాన్ని సందర్శించడానికి మలికిపురం మండల పార్టీ అధ్యక్షులు ఆడబాల యుగంధర్,రాజోలు బూత్ కమిటీల కోఆర్డినేటర్ చాగంటి స్వామి,మలికిపురం మండల పార్టీ ప్రధాన కార్యదర్శి రాపాక నవరత్నం,ముత్యాల శ్రీను,కట్టా వెంకటరమణ, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది

## మారుతున్న విద్యా విధానంలో విదేశీ విద్యకు ఎక్కువ ప్రాధాన్యత

**- భీమవరంలో సహస్ర ఓవర్సీస్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే అంజిబాబు**






**భీమవరం జూన్ 7, (తెలుగు రాష్ట్రం విలేకరి) :**

మారుతున్న విద్యా విధానంలో విద్యార్థులు నేడు విదేశీ విద్యపై ఎక్కువ మక్కువ చూపిస్తున్నారని, ఒకప్పుడు విదేశీ విద్య కొందరికి పరిమితమైందని, నేడు పేద మధ్య తరగతి విద్యార్థులకు విదేశీ విద్య అందుబాటులోకి వచ్చిందని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం నరసయ్య అగ్రహారంలో శనివారం సహస్ర ఓవర్సీస్ ను ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభించారు. విశేష అనుభవం కలిగిన సహస్ర ఓవర్సీస్ విదేశీ విద్యలో రాణించే విధంగా అన్ని మార్గాలను విద్యార్థులకు నిపుణులతో సూచనలు ఇస్తూ 3వ బ్రాంచ్ ను భీమవరంలో ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. సహస్ర ఓవర్సీస్ మట్టుపల్లి పవన్ కుమార్ మాట్లాడుతూ 2018లో విజయవాడలో మొదటి బ్రాంచ్, 2020 లో హైదరాబాద్ లో రెండో బ్రాంచ్, ఇప్పుడూ భీమవరంలో మూడో బ్రాంచ్ ను ఏర్పాటు చేశామని అన్నారు. సుమారు 6 వేల మంది విదేశాల్లో విద్యను అభ్యసించేలా శిక్షణ అందించామని అన్నారు. కార్యక్రమంలో వబిలిశెట్టి కనకరాజు, వబిలిశెట్టి రామకృష్ణ, కంతేటి వెంకటరాజు, ఆకుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యపురిలో శ్రీషిర్డీ సాయిబాబా వారి దివ్య విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

**-బాబా వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే అంజిబాబు**

**భీమవరం జూన్ 7, (తెలుగు రాష్ట్రం విలేకరి) :**



వీరవాసరం మండలం మత్స్యపురి గ్రామంలో శ్రీషిర్డీ సాయిబాబా వారి దివ్య విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని శనివారం సంప్రదాయ బద్దంగా నిర్వహించారు. ఉదయం 7.15 నిమిషాలకు శ్రీషిర్డీ సాయిబాబా విగ్రహ ప్రాణ ప్రతిష్ట పూజలు, 8.43 నిమిషాలకు జవ్వాది విష్ణుమూర్తి, జవ్వాది నాగవేణి దంపతులు, జవ్వాది సూర్యనారాయణ మూర్తి, రామలక్ష్మి దంపతులచే శ్రీషిర్డీ సాయిబాబా విగ్రహ ప్రాణ ప్రతిష్ట మహోత్సవాన్ని నిర్వహించారు. రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) బాబా వారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొని బాబావారిని దర్శించుకున్నారు. అనంతరం అన్న సమారాధనను ప్రారంభించారు. వేలాది మంది భక్తులు బాబా వారిని దర్శించుకుని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.

## గుమ్ములూరు విద్యార్థి సూర్యచంద్రిక ప్రతిభ అవార్డుకు ఎంపిక.

**-సూర్యకుమారికి పలువురు అభినందనలు.**

**కోరుకొండ జూన్ 7 (తెలుగు రాష్ట్రం విలేకరి) :**



మండలంలోని గుమ్ములూరు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థిని కొవ్వాడ సూర్యచంద్రిక పదోవతరగతి పరీక్షల్లో ఎస్సీ కమ్యూనిటీ నందు మంచి ప్రతిభ కనబరిచి మండలస్థాయిలో ప్రతిభ అవార్డుకు ఎంపిక కావడం ఆనందదాయకమని సర్పంచ్ నక్క రాంబాబు, పలువురు ప్రజా ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం విద్యార్థిని సూర్యచంద్రికను పలువురు ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు. సర్పంచ్ రాంబాబు మాట్లాడుతూ సూర్యచంద్రిక చదువుల్లో చక్కగా రాణించి, భవిష్యత్తులో ఉన్నత చదువులు చక్కగా రాణించి, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మట్ట పెద్ద వెంకటేశ్వరరావు, ఈర్ల బుజ్జిబాబు, సిహెచ్ చిట్టిబాబు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు యు గంగభవాని, ఉపాధ్యాయసిబ్బంది జాకబ్ రాజు, హేమంత్, బోస్, లక్ష్మీప్రసన్న, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తెలుగురాష్ట్రం దినపత్రిక

ఉభయ గోదావరి

https://epaper.teluguraastram.com

అమలాపురం
జూన్ 08,
ఆదివారం 2025౦౦



# మూడు బృహత్తర కార్యక్రమాలకు త్వరలోనే శంకుస్థాపన

**-రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి దుర్గేష్**



**రాజమహేంద్రవరం, జూన్ 7(తెలుగురాష్ట్రం ప్రతినిధి):** ముఖ్యమంత్రి ఆదేశాలతో త్వరలోనే తూర్పుగోదావరి జిల్లాలో మూడు బృహత్తర కార్యక్రమాలకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఎంపీ పురందేశ్వరి చేతుల మీదుగా శంకుస్థాపన జరుగుతుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడిరచారు. శనివారం కలెక్టరేట్ సమావేశపు హాలులో వివిధ శాఖలతో జరిగిన సమీక్ష సమావేశంలో మంత్రి కందుల దుర్గేష్ పాల్గొని అఖండ గోదావరి ప్రాజెక్టు శంకుస్థాపనకు సంబంధించి క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు, బహిరంగ సభా వేదిక తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. ముందుగా అనుకున్న ప్రకారం జూన్ 19వ తేదీన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఉన్నందున అఖండ గోదావరి ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమం తేదీని మరలా ప్రకటిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఎంపీ పురందేశ్వరిలు ప్రధానంగా మూడు కార్యక్రమాలను ప్రారంభించనున్నారని తెలిపారు. అందులో భాగంగా రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం బొమ్మూరులోని సైన్స్ మ్యూజియం ప్రారంభిస్తారని తెలిపారు. రాజానగరం నియోజకవర్గంలో అటవీ అకాడమీకి శంకుస్థాపన చేస్తారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయా కార్యక్రమాలకు సంబంధించిన ఏర్పాట్లు ఏ విధంగా ఉండాలన్న అంశంపై తాము చర్చించామన్నారు. అంతేగాక ప్రజల్లోకి ఈ అంశాలను తీసుకెళ్లే అంశాన్ని మాట్లాడామన్నారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. ఈ సందర్భంగా సైన్స్ అండ్ టెక్నాలజీ, ఫారెస్ట్, టూరిజం తదితర శాఖల అధికారులతో ప్రత్యేకంగా చర్చించామన్నారు. అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు స్పష్టమైన కార్యాచరణతో ముందుకు వెళ్ళే విధంగా పూర్తి స్థాయిలో చర్చలు జరిగినట్టు మంత్రి దుర్గేష్ వివరించారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం రూరల్ శాసనసభ సభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, కలెక్టర్ పి ప్రశాంతి, జిల్లా ఎస్పీ డి నరసింహా కిషోర్, మునిసిపల్ కమిషనర్ కేతన గార్గ్, జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్న రాముడు, , ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సిఎం చంద్రబాబునాయుడుకి కృతజ్ఞతలు



**జగ్గయ్యపేట, జూన్ 7 (తెలుగురాష్ట్రం విలేకరి):** కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ గా అధికార బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ని శనివారం మర్యాదపూర్వకంగా కలిసి తనకు అవకాశం ఇచ్చినందుకు కృష్ణాజిల్లా సహకార కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ చైర్మన్, మాజీమంత్రి, ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నెట్టెం రఘురామ్ కృతజ్ఞతలు తెలియజేశారు.

## పోలవరం పనులపై సీఎం సంతృప్తితో ఉన్నారు



**పోలవరం, జూన్ 7 (తెలుగు రాష్ట్రం విలేకరి) :** పోలవరం పనులపై సీఎం సంతృప్తితో ఉన్నారని మంత్రి రామానాయుడు శుక్రవారం అన్నారు. బుడమేరుకు గండ్లు పడకుండా సీసీ వాల్ నిర్మాణం జరుగుతోందన్నారు. విజయవాడకు బుడమేరు వల్ల ఇబ్బంది లేకుండా ప్లాన్ జరుగుతోందని, బుడమేరు ఓల్డ్ ఛానెల్ పనులు, ఎనికపాడు నుంచి కెపాసిటీ పెంచే చర్యలు జరగాలన్నారు. గోదావరి నుంచి వృథాగా నీరు సముద్రంలోకి పోతోందన్నారు. పోలవరం బనకచర్ల అటవీ పర్యావరణ అనుమతిపై . దృష్టి పెడుతున్నామన్నారు

## లక్ష మల్లె పువ్వులతో శారదమాతకు అలంకరణ

**భీమవరం జూన్ 7,(తెలుగు రాష్ట్రం విలేకరి) :** భీమవరం రెస్ట్ హౌస్ రోడ్ లో వేంచేసి యున్న శంకరమఠం శారదాపీఠంలోని శారదమాత అమ్మవారికి లక్ష మల్లె పువ్వుల పూజ నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు వబిలిశెట్టి శ్రీవెంకటేశ్వర్లు, భ్రమరాంబ దంపతులచే ఆలయ అర్చకులు ఘంటసాల దీక్షిత్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలను అభిషేకాలను నిర్వహించారు. అనంతరం లక్ష మల్లెలతో పూజ చేసి ప్రత్యేక అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో మహిళ భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

# యోగా జనజీవన స్రవంతిలో భాగంగా మారాలి

**-పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ -కడియపులంకలో విజయవంతంగా యోగాంధ్ర**





**కడియం,జూన్ 7 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** యోగా అనేది జనజీవన స్రవంతిలో భాగంగా మారాలని, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆశయాన్ని నెరవేర్చాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు.

తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం కడియపులంక శ్రీ సత్యదేవ (పుల్లా చంటి) నర్సరీలో శనివారం జిల్లాస్థాయి యోగాంధ్ర కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి మాట్లాడుతూ యోగాను ప్రపంచవ్యాప్తంగా విస్తరించడానికి ప్రధానమంత్రి బ్రాండ్ అంబాసిడర్ గా మారారన్నారు. ఈ నెల 21న ప్రపంచ యోగా దినోత్సవ సందర్భంగా దేశవ్యాప్తంగా అందరిని చైతన్యవంత పరచడానికి అనేక కార్యక్రమాలు రూపొందిస్తున్నారన్నారు. అందులో భాగంగానే తిరుపతిలో సినిమా ప్రముఖులతో యోగాంధ్రా కార్యక్రమం నిర్వహించే బాధ్యతను తనకు అప్పగించారన్నారు. ఇలా యోగాను ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంగా ప్రభుత్వం రోజువారి కార్యక్రమాలు చేపడుతుందన్నారు. మరో ముఖ్య అతిథి రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ తన ఆరోగ్య రహస్యం యోగా అన్నారు. 80 ఏళ్ల వయసు వచ్చినప్పటికీ తను ఆరోగ్యం గా తిరగడానికి కారణం ఇదేనని అందువల్ల ప్రతి ఒక్కరు యోగాను ప్రతిరోజు చేయాలని సూచించారు. 175 దేశాలకు పైగా ఈ 21 యోగా దినోత్సవంగా జరుపుకుంటున్నారన్నారు. ప్రతిరోజు ఒక అరగంటసేపు యోగ చేస్తే మానసిక శారీరక ఆరోగ్యం లభిస్తుందన్నారు. ఒత్తుడులు పెరిగిపోవడం వల్ల అనేక ఆరోగ్యకరమైన సమస్యలు తలెత్తుతున్నాయని ఈ విషయాన్ని గుర్తించి యోగాను ప్రతి ఒక్కరు చేపట్టాలని సూచించారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ యోగా అనేది ఒక ఈవెంట్ లా ఒక రోజుతో సరిపెట్టకూడదన్నారు. ప్రతిరోజు మన జీవన ప్రక్రియలో భాగంగా యోగాను నిర్వహించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా చర్యలు చేపట్టిందన్నారు. అందువల్ల గ్రామ మండల జిల్లా స్థాయిలో ఎవరికి వారు యోగాను ప్రజల్లోకి తీసుకెళ్లి అదో దిన చర్యగా మార్చాలన్నారు. ఇందుకు అధికార యంత్రాంగం ఎప్పుడు సిద్ధంగా ఉంటుందని కలక్టర్ తెలిపారు. అలాగే జాయింట్ కలెక్టర్ చిన్న రాముడు, ఆర్ డి ఓ కృష్ణ నాయక్, పిడి ఏపీఎంఐపి దుర్గేష్, డీటీవో వెంకటాచల, డిఎంహెచ్ఓ డాక్టర్ సుజాత కుమారి, డిప్యూటీ డిఎంహెచ్వొ డాక్టర్ కోమలి,విద్యుత్ శాఖ ఎస్సీ తిలక్,జిల్లా విద్యాశాఖ అధికారి కె.వాసుదేవ రావు,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్.మాధవరావు, ఎంపీడీవో కే. రమేష్, తాసిల్దార్ సునీల్ కుమార్, హార్టికల్చర్ అధికారి డి సుధీర్ కుమార్ తదితరులు పాల్గొని నర్సరీ రైతులు, ఉద్యోగులు, సిబ్బందితో యోగాసనాలు వేశారు. పచ్చని వాతావరణ మధ్య ఈ కార్యక్రమం ఎంతో అద్భుతంగా జరిగింది. ఈ యోగాంధ్ర కార్యక్రమం ఏర్పాట్లు చేసిన నర్సరీ రైతు పుల్లా పెద సత్యనారాయణ, సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రత్నం అయ్యప్ప తదితరులను ముఖ్య అతిథులు ప్రత్యేకంగా అభినందించారు.







# మహిళ హత్య కేసులో ఇద్దరు అరెస్టు



**చీరాల, జూన్ 7 (తెలుగురాష్ట్రం విలేఖరి) :** మండలంలో మహిళ దారుణ హత్యకు గురైన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. హత్యకు పాల్పడిన ఇద్దరు ముద్దాయిలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానిక పోలీసు స్టేషన్లో శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో హత్యకు సంబంధించిన వివరాలు చీరాల డిఎస్పి మహమ్మద్ మోయిన్ వెల్లడించారు. మండలంలోని రామన్నపేట పంచాయతీ వినాయకపురంకు చెందిన మానికల దీపిక (24) హత్యకు గురైనట్లు తెలిపారు. మృతురాలి పుట్టింటి పేరు వేటగిరి ప్రమీల. మృతురాలుకు ఏడేళ్ల క్రితం వినాయకపురంకు చెందిన మానికల ఏడుకొండలుతో వివాహం జరిగినది. వీరికి ఒక అమ్మాయి, అబ్బాయి ఉన్నారు. నాలుగేళ్ల క్రితం మృతురాలు భర్తతో గొడవపడి పుట్టింటికి వెళ్లి తిరిగి రానందున మృతురాలి భర్త పురుగుమందు తాగి చనిపోయాడు. అప్పటి నుండి మృతురాలు తన అత్త వద్ద ఉంటున్నది. మృతురాలు చెడు అలవాట్లకు అలవాటు పడి బీరు తాగటం, సిగిరెట్ తాగటం, ఇంట్లో చెప్పకుండా వెళ్ళటం, ఇంటికి ఎప్పుడో రావటం చేస్తూ ఉంటుందని పోలీసు విచారణలో తేలినట్లు తెలిపారు. ఈగ వెంకటేశ్వరరావు, సైకం నాగబాబుకు స్వయానా బావ అవుతాడు. వెంకటేశ్వరరావు భార్య సౌందర్యను సైకం నాగబాబుకు ఇచ్చి పెళ్లి చేశారు. సైకం నాగాబాబు పందిళ్లపల్లిలో ఒక మామిడి తోటకు కాపలాగా తోటలో ఒక రేకుల షెడ్డులో భార్య పిల్లలతో ఉంటున్నాడు. నిజాంపట్నం మండలం దారేసుపాలెంకు చెందిన ఈగ వెంకటేశ్వరరావు ఎనిమిదేళ్ల క్రితం రామన్నపేట పంచా యతి వినాయకపురం వచ్చి కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. వినాయకపురంకు చెందిన మృతురాలు మానికల దీపిక అలియాస్ వేటగిరి ప్రమీలతో పరిచయం పెంచుకుని ఆమెతో చనువుగా తిరుగుతూ ఉండేవాడు. తరువాత తన ఇంటి దగ్గరలో ఉంటున్న కొమరగిరి రాము లమ్మ అను ఆమెని 2వ భార్యగా వివాహం చేసుకున్నాడు. ఆ తరువాత మృతురాలు సైకం నాగబాబుతో పరిచయం పెంచుకుని అతనితో వివాహేతర సంబంధం పెట్టుకుని తనను పెళ్లి చేసుకోమని వత్తిడి చేయడమే కాకుండా పెళ్లి చేసుకోకపోతే నాగబాబును అతని భార్యతో కాపురం చెయ్యనివ్వనని బెదిరిస్తూ ఉంటుందని తెలిపారు మృతురాలు తన కాలనీలోని వారితో కూడా ఆదేవిధంగా చెప్తూ ఉండగా ముద్దాయిలు ఇద్దరూ మృతురాలిని ఎలాగైనా అడ్డు తొలగించుకోవాలని అనుకుని గత ఏప్రిల్ 30న రాత్రి ముద్దాయిలు ఇద్దరూ మృతురాలిని బీరు తాగాదామని పిలిచి పందిళ్లపల్లి, తిమ్మసముద్రం రోడ్డులో మోటార్ సైకిల్పై ఎక్కించుకుని వెళ్లి దారిలో పడిఉన్న ఒక ఫ్లెక్సీ బ్యానర్ తీసుకుని ముసలమ్మ కాలువ గట్టుమీదగా వెళ్లి పలవాల శివరాం పొలంలో మృతురాలి చేత బీరు తాగించి, ముద్దాయిలు ఇద్దరూ మృతురాలి చున్నీని మెడ చుట్టూ చుట్టి గట్టిగా లాగి హత్య చేసినట్లు తెలిపారు. మృతదేహాన్ని ఫ్లెక్సీ బ్యానర్లో చుట్టి, మృతురాలి బట్టలతోనే కట్టి మృతదేహాన్ని తీసుకు వచ్చి ఆ అర్ధరాత్రి న్యూ రోశయ్య కాలనీకి పడమరవైపున ఖాళీ పొలాల్లో గొయ్యి తవ్వి పూడ్చిపెట్టినట్లు తెలిపారు. మృతురాలి అత్త మానికల పద్మ పోలీసులకు ఇచ్చిన పిర్యాదు ఆధారంగా ఈనెల 1న ఉమెన్ మిస్సింగ్ కేసు నమోదు చేసి విచారించినట్లు తెలిపారు. ఈ కేసు ప్రాధాన్యత దృష్ట్యా తదుపరి దర్యాప్తును చీరాల రూరల్ సీఐకి అప్పగించగా ఆయన దర్యాప్తు చేసి అనుమానితులుగా ఉన్న ముద్దాయిలను శుక్రవారం ఉదయం అదుపులోనికి తీసుకుని విచారించినట్లు తెలిపారు. ముద్దాయిలు తాము చేసిన నేరం ఒప్పుకుని మృతురాలిని పూడ్చి పెట్టిన ప్రదేశాన్ని చూపించినట్లు తెలిపారు. ఆ ప్రదేశంలో తహశీల్దారు, చీరాల ఏరియా హాస్పిటల్ డాక్టర్ల సమక్షంలో తవ్వించగా మృతదేహం కుళ్ళిన స్థితిలో బయటపడింది. మృతురాలి కుడి ముంజేతి పై ఉన్న పచ్చ బొట్టు, మృతురాలి కుడి కాలు నాల్గవ వేలు మిగతా వేళ్ళ కంటే పైకి ఉండుట వలన మృతురాలి తల్లి, ఇతర బంధువులు మృతురాలిని గుర్తు పట్టినట్లు తెలిపారు. చీరాల ఏరియా హాస్పిటల్ డాక్టర్ లు పోస్టుమార్టం చేసినారు. ఉమెన్ మిస్సింగ్ కేసును హత్యా కేసుగా మార్చి ముద్దాయిలు ఇద్దరినీ అరెస్టు చేసినట్లు తెలిపారు. ముద్దాయిలను కోర్టులో హాజరు పర్చనున్నట్లు తెలిపారు. ఈ కేసును చాక చక్యంగా చేదించిన రూరల్ సీఐ పీ శేషగిరిరావు, ఎస్ఐ మీసాల వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుళ్లు బి అచ్చయ్య, తన్నీరు శ్రీను, పి నరసింహారావు, ఎస్కె బాజీత్, పిసీ బాలచంద్రను ఎస్పీ తుషార్ దూడి, చీరాల డిఎస్పి మహమ్మద్ మోయిన్ అభినందిచారు.

# పేరుకుపోయిన వ్యర్థాలు, ప్రజల ప్రాణాలకు ముప్పు!



**రాజమహేంద్రవరం, జూన్ 6 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** తూర్పుగోదావరి జిల్లా, రాజమండ్రి రూరల్ మండలం, హుక్కుంపేట మేజర్ పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య లోపాలు, వైద్య వ్యర్థాల అస్తవ్యస్త నిర్వహణ స్థానిక ప్రజల ప్రాణాలను గాలికి వదిలేస్తున్నాయన్న తీవ్ర విమర్శలు, ఆందోళనలు తీవ్ర రూపం దాల్చుతున్నాయి. "స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర" నినాదం ఇక్కడ కేవలం కాగితాలకే, ప్రచారానికే పరిమితమైందని, వాస్తవ పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా, అత్యంత దయనీయంగా ఉందని స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శాంటేజ్ సిబ్బంది ఉన్నారా? జీతాలు అందడం లేదా? అసలు ఏం జరుగుతోంది? హుక్కుంపేట పంచాయతీలో శాంటేజ్ సిబ్బంది ఉన్నారా లేదా అన్న సందేహాలు బలంగా వ్యక్తమవుతున్నాయి. "ప్రతి నెలా జీతాలు అసలంతా, కొసరంతా" అన్నట్లుగా వారికి చెల్లింపులు జరుగుతున్నాయని, దీని ప్రభావంతో పారిశుద్ధ్య పనులు సరిగా జరగడం లేదని స్థానిక ప్రజలు గుసగుసలాడుతున్నారు. ఈ నిర్లక్ష్యం గ్రామమంతా చెత్తాచెదారంతో నిండిపోవడానికి ప్రధాన కారణమవుతోంది. ఎటుచూసినా వ్యర్థాల కుప్పలు, కాలుష్యం గ్రామ ప్రజల ఆరోగ్యానికి పెను ప్రమాదంగా మారాయి. ప్రచారానికే పరిమితమైన పర్యావరణ దినోత్సవం నిస్సిగ్గు నిర్లక్ష్యం! ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహించే పర్యావరణ దినోత్సవాలు కేవలం ఫోటో సెషన్లకు, ప్రచార హోరుకు మాత్రమే పరిమితమవుతున్నాయని ఈ వార్తా కథనం తీవ్రంగా విమర్శిస్తోంది. పర్యావరణాన్ని కాపాడాల్సిన అధికారులు, నాయకులు కేవలం ప్రదర్శనలకు, ఆర్భాటాలకు ప్రాధాన్యమిచ్చి తమ చేతులు దులుపుకుంటున్నారని, దీని ఫలితంగా పల్లెలు, పట్టణాలు కాలుష్యం కోరల్లో చిక్కుకుంటున్నాయని పేర్కొంది. ముఖ్యంగా, ఈదరగాలికి ఎగురుతూ వచ్చేపోయే వాహనదారుల కనుబొమ్మల్లోకి ధూళి చేరుకుంటూ, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ అస్తవ్యస్త పరిస్థితి పాలకుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. కాలుష్యంతో ప్రజల ప్రాణాలకు ముప్పు కోట్లు కూడబెడుతున్న దుష్టశక్తులు "గాలి, నీరు యదేచ్ఛగా కలుషితం చేసి ప్రజల ప్రాణాలు గాలికి వదిలేసి కోట్లు సంపాదించుకుంటున్నారు" అంటూ వార్త కఠినమైన వ్యాఖ్యలు చేసింది. పట్టణానికి సమీపంలో ఉన్న గ్రామాల్లో కార్పొరేట్ ఫ్యాక్టరీలు, ఆసుపత్రులు ఏర్పాటు చేయడం వల్ల వాటి నుండి వచ్చే ప్రమాదకరమైన వ్యర్థాలు, కలుషిత నీరు, విషవాయువులు ఆ గ్రామాల పరిధిలో యదేచ్ఛగా వదులుతున్నారని, దీని వలన ప్రజలు దుర్గంధంతో పాటు తీవ్ర అనారోగ్యం పాలవుతున్నారని పేర్కొంది. ఇది పర్యావరణాన్ని ధ్వంసం చేయడమే కాకుండా, ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టి సంపదను కూడబెట్టే దుష్టశక్తుల పరాకాష్టగా నిలుస్తోంది. విలేజ్ క్లినిక్ వద్ద ప్రమాదకర వైద్య వ్యర్థాలు విష జ్వరాల అడ్డా మరీ ముఖ్యంగా, రాజమండ్రి హుక్కుంపేట గ్రామం పక్కన ఉన్న రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్ ఆసుపత్రి వద్ద పారిశుద్ధ్యం పూర్తిగా లోపించిందని వార్త వెల్లడించింది. రోగులు, వైద్యులు ఉపయోగించిన రక్తం అంటిన మాస్కులు, దుస్తులు, ఇంజెక్షన్లు, గాజు గుడ్డలు నేరుగా బహిరంగ ప్రదేశంలో పడేస్తున్నారని తీవ్ర ఆరోపణలున్నాయి. ఇవి గాలికి ఎగిరి ఇళ్లలోకి చేరుకుంటున్నాయని, చెత్తాచెదారం, ఇతర వ్యర్థాలతో కలిసిపోయి గ్రామానికి డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి విష జ్వరాలను మోసుకొస్తున్నాయని ప్రజలు తీవ్ర ఆందోళనతో కన్నీరుమున్నీరవుతున్నారు. భారీ వర్షాలు పెరుగుతున్న ముప్పు ప్రజల భవిష్యత్తు అంధకారం! ఇటీవలి భారీ వర్షాలకు ఈ ప్రమాదకరమైన వైద్య వ్యర్థాలు, ఇతర చెత్త ఇళ్లలోకి కొట్టుకు వస్తున్నాయని, ఇది మరింత ప్రమాదకరమని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ దుర్వాసన ప్రభావం గ్రామంలోని వృద్ధులు, చిన్న పిల్లలపై ఎక్కువగా పడి రోగాల బారిన పడితే దిక్కెవరని, భవిష్యత్తులో మెడికల్ షాపులకే పరిమితమయ్యే అవకాశం ఉందని స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం ప్రజల జీవితాలను నాశనం చేస్తోందని ఆవేదన చెందుతున్నారు. నిర్లక్ష్యంపై తీవ్ర విమర్శలు "కంచే చేను మేసింది" అన్న చందంగా గతంలో విలేజ్ క్లినిక్ ఆసుపత్రిలోని వ్యర్థాలపై అప్పటి ప్రతిపక్షంలో ఉన్న కూటమి నాయకులు ఆందోళనలు, ధర్నాలు చేసినప్పటికీ, అధికారంలోకి వచ్చాక పూర్తిగా పట్టించుకోవడం లేదని వార్త తీవ్రంగా విమర్శించింది. గ్రామస్తులు జిల్లా కలెక్టర్కు రాసిన వినతి పత్రాలు కూడా "బుట్టదాఖలైనాయి" అని పేర్కొంది. "కంచే చేను మేసింది" అనే చందంగా అధికారులు, నాయకులు ప్రజల ప్రాణాలను కాలుష్యం కోరల్లోకి నెట్టేస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేసింది. ఈ పరిస్థితిపై ప్రజా సంఘాలు, పర్యావరణవేత్తలు తక్షణమే ఉద్యమించి నాయకులు, అధికారుల చర్యలను ఎండగట్టాలని, ప్రజల ప్రాణాలను కాపాడాలని ఈ వార్తా కథనం తీవ్రంగా పిలుపునిచ్చింది. లేనిపక్షంలో హుక్కుంపేట గ్రామం విష జ్వరాలకు, కాలుష్యానికి అడ్డాగా మారి ప్రజలు తీవ్ర మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించింది.

ఉభయ గోదావరి
https://epaper.teluguraastram.com
తెలుగురాష్ట్రం దినపత్రిక

# నగరంలో 1000 చెట్లు నాటి పెంచుతాం

**- గ్రీన్ రాజమండ్రి... ఆరోగ్య రాజమండ్రి మా బాధ్యత- దేవీచౌక్ నుంచి పేపరు మిల్లులకు వెళ్ళే రోడ్డులో చెట్లు నాటిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**



**రాజమహేంద్రవరం, జూన్ 7(తెలుగురాష్ట్రం ప్రతినిధి) :** గ్రీన్ రాజమండ్రి ఆరోగ్య రాజమండ్రి సాధించేందుకు రాజమండ్రి నగరంలో మొక్కలు కాకుండా ఏకంగా 1000 చెట్లు దశల వారీగా నాటుతున్నామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) చెప్పారు. గ్రీన్ రాజమండ్రి - ఆరోగ్య రాజమండ్రి కార్యక్రమంలో భాగంగా శనివారం దేవీచౌక్ నుంచి పేపరు మిల్లుకు వెళ్ళే ప్రధాన రహదారిలో ఆయన చెట్లు నాటే కార్యక్రమానికి జనసేన పార్టీ రాజమండ్రి అధ్యక్షులు వై శ్రీను తదితరులతో కలిసి మాటూరి సిద్ధు సారధ్యంలో శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ ఎన్ని చెట్లు నాటుదామని అడిగితే 11 నాటుదామని తమ నాయకులు చెప్పారని, ఎందుకంటే తమ వాళ్ళు 11 సంఖ్యను మర్చిపోలేకపోతున్నారని చలోక్తిగా అన్నారు. ప్రారంభ కార్యక్రమంలో 11 చెట్లు నాటుతున్నామని, ఒక్కో చెట్టును ఒకరు దత్తత తీసుకుని పెంచుతారని చెప్పారు. తనను భారీ మెజారిటీతో గెలిపించిన నగర ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపడుతున్నామని ఆయన చెప్పారు. ఖర్చు కోసం చూడకుండా ఏకంగా చెట్లు నాటుతున్నామని, ఇది పదిమంది ఆదర్శంగా తీసుకోవాలని ఆయన కోరారు. అందరూ కలిసికట్టుగా ఎలాంటి స్వార్ధం లేకుండా ఈ పని చేస్తున్నామని ఆయన తెలిపారు. దేవీచౌక్ లో రోజూ పనుల కోసం వచ్చే వందలాదిమంది కార్మికులకు నీడ కరువైందని, వారందరు ఈ చెట్ల నీడన సేదతీరవచ్చని ఆయన అన్నారు. సంవత్సరంలో ఈ చెట్లు చాలా పెద్దది అవుతుందని దానిని చూస్తే సంతోషం కలుగుతుందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. ఈ చెట్లువల్ల రాజమండ్రి నగరంలో ఒక సెల్సియస్ డిగ్రీ ఉష్ణోగ్రత తగ్గినా చాలని, రాజమండ్రిలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు చెట్లు పెంచడంవల్ల ఉష్ణోగ్రతలు తగ్గాయట, ఆయనను ఆదర్శంగా తీసుకుని మనం కూడా చెట్లు నాటుదామని మిగతా వారు అనుకుంటే సంతోషమని ఆయన అన్నారు. జన సంచారం ఎక్కువగా ఉండే ఇలాంటి ప్రాంతాల్లో చెట్లు ఉంటే స్వచ్ఛమైన ఆక్సిజన్ కూడా అందుతుందని ఆయన చెప్పారు. భవిష్యత్తు తరాలవారికి ఈ చెట్లు ఉపయోగపడే విధంగా నాటుతున్నామని, ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. మొక్కలు నాటి పెంచడం వల్ల పచ్చదనం, ఆరోగ్యం పెరుగుతాయని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ చెప్పారు. కూటమి ప్రభుత్వం బాధ్యతగా పని చేస్తుందని ఆయన అన్నారు. గ్రీన్ రాజమండ్రి - ఆరోగ్య రాజమండ్రి కార్యక్రమంలో భాగంగా అన్ని ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చూస్తున్నామని హెూటళ్ళలో అన్నీ క్వాలిటీతో ఉన్నవి వాడుతున్నారా లేదా అని తనిఖీ చేస్తున్నామని ఆయన చెప్పారు. మనం మంచి సంకల్పంతో ఒకడుగు ముందుకు వేస్తే ప్రకృతి, భగవంతుడు మనకు సహకరిస్తారని ఆయన అన్నారు. కూటమి నాయకులంతా ప్రజలకు మంచి చేసే పనులు చేస్తున్నారని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కాశి నవీన్ కుమార్, వర్రే శ్రీనివాస్, మజ్జి రాంబాబు, రెడ్డి మాణేశ్వరరావు, బుడ్డిగ రాధా, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.


## ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు బద్దె నాయక్ పేద కుటుంబానికి 20వేల ఆర్థిక సాయం



**కళ్యాణదుర్గం, జూన్ 7(తెలుగు రాష్ట్రం విలేఖరి):** బోరంపల్లి గ్రామానికి చెందిన బోయ పాలన్నకు గత కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స చేసుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఉపాధ్యాయుడు ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు బద్దె నాయక్ తన జన్మదిన సందర్భంగా 20,000 వేల ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా చెక్కును ఆయన కుమారుడి చేతుల మీదుగా బాధతుడికి అందజేశారు. ప్రతి పుట్టినరోజు సందర్భంగా బోరంపల్లి లోనే గత రెండేళ్లుగా ఆర్థిక సహాయం చేస్తున్నడం విశేషం. బద్దేనాయకు గ్రామస్తులు కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు బోయ మారెప్ప, ఆనం రంగారెడ్డి, చాకలి వెంకటేష్, డీలర్ గోపాల్, ఎర్రి స్వామి, బ్రహ్మయ్య, నారాయణ, శ్రీనివాసులు, హెచ్ మల్లికార్జున, ఫీల్డ్ అసిస్టెంట్ రామాంజనేయులు, రాజు, గంగాధర్, సన్నప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

## మరొకరికి చూపునిచ్చేందుకు నేత్రదానం





**టీ. నర్సాపురం, జూన్ 7 (తెలుగు రాష్ట్రం విలేఖరి ):** టీ. నర్సాపురం: మండలంలోని బొరంపాలెం గ్రామానికి చెందిన వీరమల్ల సూర్యరావు శుక్రవారం సాయంత్రం మృతి చెందారు మరొకరికి చూపునిచ్చేందుకు సూర్యరావు నేత్రాలను దానం ఇచ్చేందుకు భార్య వీరమ్మ, కుమారులు సత్యనారాయణ, వెంకటేశ్వరరావు ఒప్పుకున్నారు. దీంతో ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రి వారు సూర్యారావు నేత్రాలను సేకరించారు. మృతి చెందిన ప్రతి ఒక్కరు నేత్రాలను దానం చేయటానికి ముందుకు రావాలని కోరారు. ఒకరు నేత్రదానం చేయడం ద్వారా 16 సంవత్సరాల లోపు నలుగురు అందులకు చూపును ఇచ్చే అవకాశం ఉంటుందని ఎల్వి ప్రసాద్ నేత్ర వైద్యాలయం టెక్నీషియన్స్ సుధారాణి, హరికృష్ణ తెలిపారు.

## అగ్ని ప్రమాద బాధితులకు కుంచే రమణారావు సాయం





**అంబాజీపేట, జూన్ 7 (తెలుగు రాష్ట్రం విలేఖరి) :** వాకల గరువు గ్రామంలో బుల్లియ్య కాలనీలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో తాటాకిళ్లు పూర్తిగా దగ్ధమై ముత్తాబత్తుల వీర వెంకట సత్యనారాయణ, దాకే వెంకటరావు కుటుంబాలు సర్వం కోల్పోయి నిరాశ్రయులు అయ్యారు. విషయం తెలుసుకున్న అమలాపురం నియోజకవర్గ వైఎస్సార్ సిపి సీనియర్ నాయకులు మరియు గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు సాయం అందించారు. బాధిత కుటుంబాలకు బియ్యం,వంట సామాగ్రి, నిత్యవసర వస్తువులు, దుస్తులను అందజేశారు. సాయం అందించిన రమణారావుకు బాధిత కుటుంబాలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు ముత్తాబత్తుల వెంకటేశ్వరరావు, ముత్తాబత్తుల దుర్గారావు, సాపేరాము, మందపాటి బాలకృష్ణ, నక్కాసత్యనారాయణ, పాస్టర్ జాన్సన్ మరియు ఫౌండేషన్ సభ్యులు పందిరి సుబ్బరాజు,గంటా లక్ష్మీ ప్రసాద్,కుంచే అర్జున్,పరమట రాజేష్, నూకపెయ్యి మనోజ్ కుమార్,గణేష్ , విప్పర్తి రమేష్, బల్లా చినరాజా, పోలినాటి భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య 42 వ ఆవిర్భావ దినోత్సవం

**-సమాఖ్య పతాకాన్ని ఆవిష్కరించిన పుల్లేవు సూర్య వెంకటరావు**



**రాజమహేంద్రవరం, జూన్ 7(తెలుగురాష్ట్రం ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య 42 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కోనూరు సతీష్ శర్మ ఆదేశాల మేరకు రాజమండ్రిలోని సమాఖ్య ప్రాంతీయ కార్యాలయంలో శనివారం రాజమండ్రి నగర బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు, సమాఖ్య సీనియర్ సభ్యుడు పుల్లేవు సూర్య వెంకటరావు సమాఖ్య పతాకాన్ని ఆవిష్కరించారు.అనంతరం పుల్లేవు సూర్య వెంకటరావు మాట్లాడుతూ 1984 జూన్ 7 నుంచి సంఘ సమాఖ్యలో వివిధ పదవులు చేపట్టిన నాయకుల గురించి ప్రస్తావించి వారు చేపట్టిన కార్యక్రమాలను తెలియచేశారు.ప్రస్తుత అధ్యక్షుడు కోనూరు సతీష్ శర్మ ఆధ్వర్యంలో ఇంకా మంచి కార్యక్రమాలు చేపట్టి సంఘాన్ని మరింత అభివృద్ధి చేయాలని పుల్లేవు సూర్య వెంకటరావు కోరారు.కార్యక్రమంలో కల్లూరి సోమయాజులు, రాజానగరం కన్వీనర్ కొత్తపల్లి భాస్కరరామ్, రాష్ట్ర కార్యదర్శి భాగవతుల వెంకటరమణమూర్తి, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి కె. సూర్యకుమారి, రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు పుల్లేవు ఉపేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎంఎం ఎస్ కు ఎంపికైన విద్యార్థి



**చీరాల, జూన్ 7 (తెలుగురాష్ట్రం విలేఖరి) :** ఆంధ్రప్రదేశ్ విద్యా శాఖ ప్రతిఏటా నిర్వహించే నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్ టెస్ట్ ఫైనల్ ఫలితాల్లో బట్ట లలిత్ సాయి విగ్నేష్ ఎంపికయ్యారు. 128 మార్కులు సాధించి జిల్లా 17వ ర్యాంక్ పొందారు. మండలంలో ప్రథమస్థానంలో సాధించాడు. 8వ తరగతి చదివే విద్యార్థులు ఈ పరీక్షకు అర్హులు. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు జాతీయ స్థాయిలో జరిగే ఎన్ఎంఎంఎస్ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఏడాదికి రూ.12వేల చొప్పున 9వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు నగదు అందిస్తారు. ఈ సందర్భంగా శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులకు, ర్యాంకు పొందిన విద్యార్థి లలిత్కు ప్రధానోపాధ్యాయులు తలమల దీప్తి, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

## ప్రజా దర్బార్ లో 87 అర్జీలు స్వీకరణ



**చీరాల, జూన్ 7 (తెలుగురాష్ట్రం విలేఖరి) :** తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొండయ్య కుమారుడు టిడిపి యువ నాయకులు మద్దులూరి గౌరీ అమర్నాథ్ పాల్గొని సమస్యలపై వచ్చిన ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. మొత్తం 87 అర్జీలు వచ్చినట్లు అమర్నాథ్ చెప్పారు. వాటిని ఆయా శాఖల అధికారులకు బదలాయించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏం సి చైర్మన్ కౌతరపు జనార్ధన్, గంజి పురుషోత్తం యర్ర శివ నాగమల్లేశ్వరి, కారంపూడి పద్మిని ప్రసన్న, బిజెపి చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## తోటవారి గ్రామంలో పర్యావరణ దినోత్సవం నిర్వహణ



**చీరాల, జున్ 7( తెలుగురాష్ట్రం విలేఖరి) :** తోటవారి గ్రామంలో "కార్డ్స్ సంస్థ" మరియు "మేశాయత భోగత భారత్" సంయుక్త ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.పలు అంశాలపై చర్చించారు., ప్లాస్టిక్ వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయడం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడం, జ్యూట్ బ్యాగులు, కాగిత రేకులతో తయారైన ఫైళ్ల వినియోగాన్ని ప్రోత్సహించడం వంటి సందేశాలను ప్రజలతో పంచుకున్నారు. ప్లాస్టిక్ వినియోగం మానవాళికి మాత్రమే కాకుండా జంతు జాతులకు కూడా ముప్పుగా మారుతోందని నిర్వాహకులు స్పష్టం చేశారు. విద్యార్థులు, యువత, గ్రామస్తులు చురుకుగా పాల్గొని డిబేట్స్, డిస్కషన్స్ నిర్వహించారు. 81320 నంబర్లో నమోదైన నాదెండ్ల కోతయ్యరావు సబీరాల వాకా కార్యవర్గం మరియు "మేషన్ 2000" వి ఆర్ ఓ పి వి యస్ సంస్థలు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాయి. ఉయ్యాలదేవి తాగునీటి పథకంపై చర్చలు జరిగాయి.ఈ సందర్భంగా పలువురు అధికారులు మరియు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ ప్రకృతిని ప్రేమించడం అంటే మన భవిష్యత్తును కాపాడడమే" అని అన్నారు.

## ప్రత్యేక పూజలు పాల్గొన్న గౌరీ అమర్నాథ్



**చీరాల, జూన్ 7 (తెలుగురాష్ట్రం విలేఖరి) :** వేటపాలెం నందు శ్రీ గంగా పార్వతీ సమేత అమరలింగేశ్వర స్వామి మరియు శ్రీ రామలింగ చౌడేశ్వరీ దేవస్థానంలో ప్రత్యేక పూజలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు మద్దులూరి గౌరీ అమర్నాథ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసంతర్పణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంసీ చైర్మన్ జనార్దన్ ,గుత్తి శివయ్య దుర్గామల్లేశ్వరి జంగిలి రాముడు తదితరులు పాల్గొన్నారు.

## పవర్ లిఫ్టింగ్ విజేతలకు అభినందించిన ఎమ్మెల్యే



**జగ్గయ్యపేట, జూన్ 7 (తెలుగురాష్ట్రం విలేకరి):** ప్రకాశం జిల్లా ఒంగోలులోని డాక్టర్ పనంద్ మినీ స్టేడియంలో పురుషులు మరియు మహిళలకు 12వ సబ్-జూనియర్, జూనియర్, సీనియర్ మరియు మాస్టర్స్ పవర్లిఫ్టింగ్ మరియు బెంచ్ ప్రెస్ ఛాంపియన్షిప్ మే 31 నుండి జూన్ 2 వరకు జరిగిన పోటిలలో భాగంగా ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట కు చెందిన జి. వెంకటేశ్వరావు (మాస్టర్స్ గోల్డ్ మెడల్, (స్ట్రాంగ్ మెన్ టైటిల్), ఎస్. ప్రహర్షిణి (సబ్ జూనియర్ గోల్డ్ మెడల్, సీనియర్ కాంస్య పతకం), జి. నాగ సాయి గీతిక (జూనియర్ సిల్వర్ మెడల్, సీనియర్ సిల్వర్ మెడల్), ఎం. తిరుపతమ్మ (జూనియర్ - సీనియర్ బంగారు పతకం, జూనియర్, సీనియర్ విభాగాల్లో బలమైన మహిళల టైటిల్), ఎస్ కె. అబ్దుల్ వహాబ్ (సీనియర్-రజత పతకం మరియు కాంస్య పతకం), మొత్తం ఓవరాల్ ఛాంపియన్షిప్ స్త్రీలు మరియు పురుషులు రెండవ స్థానంగా నిలిచారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య నివాసంలో వారిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజేతులను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

# ఇదే దిక్కుమాలిన వేతన వ్యవస్థ!

**భారత మాజీ క్రికెటర్ సునీల్ గవాస్కర్, దేశవాళీ క్రికెటర్లకు తగిన వేతనాలు లభించకపోవడంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రియాంక్ పంచల్ లాంటి ఆటగాళ్లు ఎంతో ప్రతిభ ఉన్నా, ఐపీఎల్‌లో అవకాశాలు లేక చిన్న పారితోషికాలతో ఆటను ముగించాల్సి వచ్చిందని అన్నారు. ఐపీఎల్‌లో ఒక్క మ్యాచ్ ఆడకుండానే కోట్ల రూపాయలు సంపాదించేవారితో పోలిస్తే ఇది అన్యాయం అని అన్నారు. దేశవాళీ క్రికెట్‌కు ఫీజు స్లాబ్ వ్యవస్థను ప్రవేశపెట్టాలని, ఎక్కువ కృషి చేసిన వారికి న్యాయం జరగాలని గవాస్కర్ సూచించారు.**



భారత మాజీ క్రికెటర్ సునీల్ గవాస్కర్ దేశవాళీ క్రికెట్ వేతన వ్యవస్థపై తీవ్రమైన ఆవేదన వ్యక్తం చేశారు. దేశవాళీ క్రికెట్‌లో ఉత్తమ ప్రదర్శనలతో బాగా రాణిస్తున్నప్పటికీ, అనేక మంది క్రికెటర్లు తగిన గుర్తింపును పొందకుండానే తక్కువ పారితోషికాలతో తమ కెరీర్‌ను ముగించాల్సి వస్తోందని ఆయన పేర్కొన్నారు. రంజీ ట్రోఫీ లాంటి కీలక టోర్నమెంట్లలో సంవత్సరాల పాటు అద్భుతంగా ఆడిన వారికి తగిన రెమ్యూనరేషన్ దక్కకపోగా, ఐపీఎల్ వేలంలో ఒక్క మంచి ప్రదర్శన లేకుండానే కోట్ల రూపాయల డీల్ సంపాదించే అన్‌క్యాప్డ్ ఆటగాళ్లు ఎక్కువగా ఉన్నారని ఆయన అన్నారు. ఈ అసమానతను తప్పనిసరిగా సరిచేయాలని గవాస్కర్ కోరారు.

తన వాదనకు బలం చేకూర్చే విధంగా గవాస్కర్ ఇటీవలే రిటైరైన ప్రియాంక్ పంచల్ ఉదాహరణను ఇచ్చారు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 9,000 పరుగులు చేసిన పంచల్ 29 సెంచరీలతో మెరవడంతో పాటు భారతదేశం %ూ% జట్టుకు నాయకత్వం కూడా వహించాడు. అయినప్పటికీ, భారత సీనియర్ జట్టుకు ప్రాతినిధ్యం వహించలేకపోయాడు. ఐపీఎల్ లాంటి లీగ్‌లో కనీసం ఒక్క కాంట్రాక్ట్ కూడా పొందలేదు. అలాంటి పంచల్ లాంటి ఆటగాడికి తన యవ్వనాన్ని ఆటకు అంకితం చేసినప్పటికీ, బ్యాంక్ ఖాతాలో పెద్దగా సొమ్ము లేకపోవడం ఎంత బాధాకరమో గవాస్కర్ ఆవేదనతో వెల్లడించారు.

అదే సమయంలో, ఐపీఎల్‌లో ఒక్క మ్యాచ్ ఆడకుండానే కొన్ని కోట్ల రూపాయల పారితోషికం పొందిన ఆటగాళ్లు ఉన్నారని గుర్తు చేశారు. దేశవ్యాప్తంగా అన్ని రకాల వాతావరణ పరిస్థితులలో రెండు దశాబ్దాలు ఆటను కొనసాగించిన పంచల్‌కు రంజీ ట్రోఫీ ద్వారా రూ. 3 కోట్లు వచ్చినా ఆశ్చర్యమేనని చెప్పారు. ఇది దేశీయ క్రికెట్, ఐపీఎల్ మధ్య వేతన వ్యత్యాసాన్ని బలంగా చూపించేదిగా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

మార్కెట్ శక్తుల వల్ల ఇలా జరుగుతోందనే వాదనను గవాస్కర్ ఖండించారు. చాలా సందర్భాల్లో ఆటగాళ్ల ఎంపిక అదృష్టం ఆధారంగా జరుగుతుందని, కేవలం ప్రతిభతో మాత్రమే డీల్స్ లభించడంలేదని వ్యాఖ్యానించారు. కొన్ని ఫ్రాంచైజీలు యువ ప్రతిభను చూపించాలనే ఉద్దేశ్యంతో ముందుకు వచ్చేవని, ఇది వారిని కోటీశ్వరులుగా మార్చినా వారు భారత జట్టుకు పెద్దగా ఏమీ అందించలేదని చెప్పారు.


ఈ అసమానతల నివారణకు గవాస్కర్ ఒక ప్రతిపాదనను ముందుకు తెచ్చారు. దేశవాళీ క్రికెట్‌లో ఫీజు స్లాబ్ వ్యవస్థను రూపొందించాలని, ఎక్కువ మ్యాచ్‌లు ఆడినవారికి, తమ జట్టును నాకౌట్ దశల వరకూ తీసుకెళ్లిన ఆటగాళ్లకు ఎక్కువ పారితోషికం ఇవ్వాలని సూచించారు. %దీజజ×% వద్ద నిధుల కొరత లేకపోవడంతో, వచ్చే దేశవాళీ సీజన్ ప్రారంభానికి ముందుగా ఈ మార్పులను పరిగణనలోకి తీసుకోవాలని గవాస్కర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# మా నాన్న టెస్ట్ క్రికెట్‌కు వీరాభిమాని!

## రోహిత్ రిటైర్మెంట్ ఇచ్చాక తన ఫాదర్ రియాక్షన్ ఇదేనంట!

**భారత క్రికెట్‌లో గొప్ప ఓపెనింగ్ బ్యాట్స్‌మన్‌గా పేరొందిన రోహిత్ శర్మ టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించడం క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురి చేసింది. ఇంగ్లాండ్ పర్యటన కోసం జట్టు ఎంపికకు ముందు ఈ నిర్ణయం తీసుకున్న రోహిత్, టెస్ట్ క్రికెట్‌కు ఇక దూరంగా ఉండాలని ప్రకటించాడు. అతను బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ తర్వాత ఉత్తమ ఫామ్‌లో లేకపోయినా టెస్ట్‌లను కొనసాగించాలన్న తన కోరికను బహిరంగంగా వెల్లడించగా, ఆ తర్వాత వచ్చిన ఈ రిటైర్మెంట్ వార్త వింతగా అనిపించింది. టెస్ట్ ఫార్మాట్‌కు తన సేవలు కొనసాగించాలని అంతకుముందు చెప్పిన రోహిత్, రంజీ ట్రోఫీలో కూడా తలపడి తాను ఇంకా క్రికెట్‌ను వదలలేదని చూపించాడు. అయితే, చివరకు బూట్లు తీయాలని నిర్ణయించడం అతని అభిమానులతో పాటు భారత క్రికెట్ వర్గాలను కూడా ఆశ్చర్యానికి గురి చేసింది.**





ఈ నిర్ణయం రోహిత్ తండ్రిని కూడా నిరాశపరిచింది. ముంబైలో జరిగిన చతేశ్వర్ పుజారా భార్య పూజారా రాసిన 'ది డైరీ ఆఫ్ ఎ క్రికెటర్స్ వైఫ్' పుస్తక ఆవిష్కరణ సందర్భంగా రోహిత్ తన తండ్రి టెస్ట్ క్రికెట్‌పై ఉన్న అభిమానం గురించి వెల్లడించాడు. "నాన్న ఒక రవాణా సంస్థలో పనిచేశారు. మా కుటుంబ జీవితం కోసం చాలా త్యాగాలు చేశారు. కానీ ఆయన మొదటి రోజు నుండి టెస్ట్ క్రికెట్‌కు వీరాభిమానిగా ఉన్నారు. ఆయనకు ఈ కొత్త తరం క్రికెట్ – టీ20లు, ఫ్రాంచైజీ లీగ్స్ అంతగా నచ్చవు. నేను వన్డేలో 264 పరుగులు చేసినప్పుడు కూడా ఆయన పెద్దగా స్పందించలేదు.

కానీ టెస్టుల్లో నేను చేసిన 30, 40, 50 స్కోర్లపైనా ఆయనతో పొడవుగా చర్చించేవారు. అతనికి ఉన్న ప్రేమ అది," అని రోహిత్ పేర్కొన్నాడు. టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించినప్పుడు తన తండ్రి కొంత నిరాశకు లోనైనట్టు రోహిత్ తెలిపాడు. అయితే, తన ప్రయాణం పూర్తిగా చూశాడు కాబట్టి చివరకు ఆయన కూడా ఆనందంగా మద్దతు ఇచ్చినట్టు పేర్కొన్నాడు. "నన్ను చిన్నప్పటి నుంచి స్కూల్ క్రికెట్ నుండి ఇండియా %ూ% వరకు చూశారు. నేను రంజీ, దులీప్, ఇరానీ ట్రోఫీలు ఆడాను. అందుకే ఆయన నాకు ఇచ్చిన మద్దతు అమోఘం. నేడు నేను ఇక్కడికి వచ్చానంటే, నాన్న పాత్ర చాలా కీలకమైనది. ఆయన సహకారం లేకపోతే ఇది సాధ్యం అయ్యేది కాదు" అని భావోద్వేగంతో చెప్పాడు. రోహిత్ శర్మ తన టెస్ట్ కెరీర్‌ను 12 సెంచరీలు, 18 అర్ధ సెంచరీలతో ముగించాడు. అతను 2023లో భారత జట్టును వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు నడిపించినప్పటికీ, భారత్ ఆ టైటిల్‌ను చేజిక్కించుకోలేక పోయింది. అయినా కూడా, టెస్ట్ క్రికెట్‌లో రోహిత్ శర్మ అందించిన సేవలు భారత క్రికెట్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయి.

# ఇద్దరు బౌలింగ్ పిల్లర్లపై కీలక అప్డేట్ ఇచ్చిన ఈసీబీ!

## ఇండియాపై రీఎంట్రీ ఇచ్చేది ఆ టెస్టుల్లోనే!



**భారత్‌తో జరుగుతున్న టెస్ట్ సిరీస్‌లో ఇంగ్లాండ్ జట్టుకు శు భవార్తలొచ్చాయి. గాయాల కారణంగా దూరంగా ఉన్న ఫాస్ట్ బౌలర్ మార్క్ వుడ్ నాల్గవ లేదా ఐదవ టెస్టులో ఆడే అవకాశముందని తెలుస్తోంది. అలాగే జోఫ్రా ఆర్చర్ కూడా రెండవ టెస్టులో అందుబాటులో ఉండే అవకాశముంది. ఈ ఇద్దరు బౌలర్ల రీ ఎంట్రీతో ఇంగ్లాండ్ బౌలింగ్ విభాగం పటిష్టంగా మారి, విజయం సాధించే ఆశలు పెరిగే అవకాశముంది. భారత్‌తో జరుగుతున్న టెస్టు సిరీస్‌కు సంబంధించి ఇంగ్లాండ్‌కు ఒక శు భవార్త అందింది. నాల్గవ లేదా ఐదవ టెస్టు మ్యాచ్‌కు ఫాస్ట్ బౌలర్ మార్క్ వుడ్ తిరిగి వచ్చే అవకాశముందని సమాచారం. ఇంగ్లాండ్ సెలెక్టర్ ల్యూక్ రైట్ తెలిపిన వివరాల ప్రకారం, వుడ్ మోకాలి శస్త్రచికిత్స తర్వాత కోలుకుంటున్నాడని, అతని పునరావాసం క్రమంగా పురోగతిలో ఉందని తెలిపారు. వుడ్ ఇప్పుడిప్పుడే తేలికపాటి బౌలింగ్ సెషన్‌లను ప్రారంభించాడని, అతను మళ్లీ పూర్తి స్థాయిలో బౌలింగ్ చేయగల స్థితిలోకి రావడానికి మరికొంత సమయం పట్టవచ్చని చెప్పారు. అయినప్పటికీ, నాల్గవ లేదా ఐదవ టెస్టుకు అతను ఎంపికలో ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు.**

మార్క్ వుడ్ మళ్లీ బరిలోకి దిగితే, ఇంగ్లాండ్ బౌలింగ్ విభాగానికి ఇది పెద్ద బలంగా మారుతుంది. అతని వేగవంతమైన బౌలింగ్, రివర్స్ స్వింగ్ నైపుణ్యం భారత బ్యాటర్లను గతంలో తీవ్రంగా ఇబ్బంది పెట్టింది. 2025 ఛాంపియన్స్ ట్రోఫీ నుంచి ఇంగ్లాండ్ తొందరగా నిష్క్రమించాక అతను శస్త్రచికిత్స చేయించుకున్నాడు. దాదాపు నాలుగు నెలలుగా ఆటకు దూరంగా ఉన్న వుడ్, తన శారీరక స్థితిని మెరుగుపరుచుకుంటూ మళ్లీ జట్టులోకి రావడానికి ప్రయత్నిస్తున్నాడు. ఇదిలా ఉండగా, జోఫ్రా ఆర్చర్ గాయం విషయం గురించి కూడా ల్యూక్ రైట్ స్పందించారు. ఐపీఎల్ 2025 చివరి దశలో బొటనవేలికి గాయం కావడంతో మొదటి టెస్టుకు అతను అందుబాటులో ఉండలేకపోయాడు. అయితే, రెండవ టెస్టుకు అతను అందుబాటులో ఉండే అవకాశం ఉందని తెలిపారు. టూర్ ప్రారంభంలో వుడ్, ఆర్చర్, గస్ అట్కిన్సన్ అందుబాటులో లేకపోవడంతో, ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు జామీ ఓవర్టన్‌ను మూడు సంవత్సరాల అనంతరం తిరిగి టెస్టు జట్టులోకి తీసుకుంది. ఇలా మార్క్ వుడ్, జోఫ్రా ఆర్చర్ వంటి ముఖ్యమైన ఫాస్ట్ బౌలర్ల తిరిగి జట్టులోకి వచ్చే అవకాశంతో ఇంగ్లాండ్‌కు టెస్ట్ సిరీస్ మిగిలిన భాగాల్లో విజయం సాధించే శక్తి పెరగనుంది. ఈ ఇద్దరి ఫిట్‌నెస్ పరిస్థితులపై రోజువారీ మానిటరింగ్ జరుగుతున్నప్పటికీ, వీరి సహకారం ఇంగ్లాండ్ విజయ ఆశలకు ఊతమిచ్చే అంశంగా నిలవనుంది.

# ఈ సారి వస్తున్నాం ట్రోఫీ కొడుతున్నాం!

**2025 వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌లో దక్షిణాఫ్రికా జట్టు ఆస్ట్రేలియాను ఢీకొనబోతుండగా, డివిలియర్స్ తమ జట్టు పై నమ్మకం వ్యక్తం చేశారు. రెండు దశాబ్దాల అనంతరం తొలి ఐసీసీ టైటిల్‌ను గెలవాలని ప్రోటీస్ ఉత్సాహంగా ఉంది. ఆటగాళ్ల ఫామ్, పట్టుదల, బలమైన బౌలింగ్ విభాగం దక్షిణాఫ్రికాకు అద్భుత అవకాశం కల్పిస్తుందని ఆయన పేర్కొన్నాడు. ఇదే సమయంలో ఆస్ట్రేలియా జట్టు అనుభవంతో ఫైనల్‌ను హోరాహోరీగా మార్చనుందని క్రికెట్ ప్రపంచం ఆసక్తిగా ఎదురుచూస్తోంది.**



2025 ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌లో ఆస్ట్రేలియాతో తలపడనున్న దక్షిణాఫ్రికా జట్టు అవకాశాలపై మాజీ క్రికెట్ దిగ్గజం ఏబీ డివిలియర్స్ నమ్మకంగా ఉన్నాడు. జూన్ 11న లండన్‌లోని లార్డ్స్ మైదానంలో జరిగే ఈ ప్రతిష్టాత్మక ఫైనల్‌కి సంబంధించి డివిలియర్స్ తన దేశ జట్టు విజయంపై ఆశాభావం వ్యక్తం చేశాడు. గతంలో జూన్ 2023లో జరిగిన ఫైనల్‌లో భారత్‌ను ఓడించిన డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా ఈసారి కూడా ఫేవరెట్ జట్టుగా బరిలోకి దిగుతున్నప్పటికీ, దక్షిణాఫ్రికా దాదాపు రెండు దశాబ్దాల అనంతరం తమ తొలి ఐసీసీ ట్రోఫీని గెలవాలని లక్ష్యంగా పెట్టుకుంది. "దక్షిణాఫ్రికా క్రికెట్‌కు ఇది గర్వకారణమైన క్షణం. లార్డ్స్‌లో జరిగే ఫైనల్‌లో దేశం మొత్తం మా వెనుక నిలబడుతుంది. మేము ఆ గీతను దాటగలమని ఆశిస్తున్నాం," అని డివిలియర్స్ వ్యాఖ్యానించాడు. డివిలియర్స్ అభిప్రాయం ప్రకారం, ఇది ఒక సమతుల్య జట్టు పోరాటం కానుంది. తన జట్టు ఫామ్‌లో ఉండటం, ఆటగాళ్లలోని పట్టుదల, ప్రదర్శించాల్సిన ఆత్మస్థైర్యం దక్షిణాఫ్రికాను విజయానికి దగ్గర తీసుకెళ్లే అంశాలుగా అభివర్ణించాడు. "ఆస్ట్రేలియా అనుభవజ్ఞులైన జట్టు. వారు బాగా జోరుగా సాగుతున్నారు. కానీ దక్షిణాఫ్రికా తక్కువేమీ కాదు. ఫామ్‌లో ఉన్న ఆటగాళ్లతో పాటు జట్టులో నిరూపించుకోవలసిన తత్వం ఉన్నవారు ఉన్నారు. అందుకే నేను నమ్మకంగా ఉన్నాను," అని డివిలియర్స్ వివరించాడు.

గత రెండేళ్లుగా దక్షిణాఫ్రికా ఐసీసీ ఈవెంట్లలో మంచి ప్రదర్శన కనబరిచింది. వారు పురుషుల వరల్డ్ కప్ సెమీఫైనల్, ఛాంపియన్స్ ట్రోఫీ సెమీఫైనల్, టీ20 వరల్డ్ కప్ ఫైనల్ వరకు చేరుకోవడమే కాకుండా, ఇప్పుడు టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌లో కూడా అడుగుపెట్టారు. ఇది వారి స్థిరమైన ప్రగతికి నిదర్శనంగా చెప్పవచ్చు. ఇక మ్యాచ్ విశ్లేషణలో ఆసక్తికరంగా పాల్గొన్న ఆస్ట్రేలియా మాజీ బ్యాట్స్‌మన్ ఆరోన్ ఫించ్ మాట్లాడుతూ, ఇరు జట్లకు అత్యంత అనుభవజ్ఞులైన బౌలింగ్ దళాలు ఉన్నాయని పేర్కొన్నాడు. "టెస్ట్ క్రికెట్‌కు ముందస్తు సన్నద్ధత తక్కువగా ఉండటం సవాలుగా మారొచ్చు. కానీ ఈ పరిస్థితుల్లో ఎవరు తొందరగా అనుకూలించగలరో వారే మ్యాచ్‌ను డామినేట్ చేస్తారు. ఇద్దరు జట్లూ తమ బౌలింగ్ విశ్వరూపంతో ఒకరినొకరు పరీక్షించబోతున్నాయి," అని ఫించ్ అభిప్రాయపడ్డాడు. మొత్తంగా, 2025 WTC ఫైనల్ ఒక తలతల లాంటి పోరుగా మారే అవకాశం ఉంది. ఒకవైపు ప్రపంచ నంబర్ వన్ జట్టు అయిన ఆస్ట్రేలియా, మరోవైపు తమ తొలి ఐసీసీ టైటిల్ కోసం పోరాడుతున్న ప్రోటీస్. క్రికెట్ ప్రపంచం ఈ గ్రాండ్ క్లాష్‌ను ఆసక్తిగా ఎదురుచూస్తోంది.

CINIMA NEWS
https://epaper.teluguraastram.com
తెలుగురాష్ట్రం దినపత్రిక



# అల్లు అర్జున్ సినిమాలో దీపికా పదుకొనే ఖరారు

అట్లీ కాంబినేషన్‌లో సైన్స్ ఫిక్షన్ సంచలనం: కథానాయికగా దీపికా పదుకొనే ఖరారుమరియు బ్లాక్‌బస్టర్ దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో ఓ భారీ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. అనే వర్కింగ్ టైటిల్‌తో రూపుదిద్దుకుంటున్న ఈ ప్రాజెక్ట్ ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ ఆసక్తిని రేపుతోంది. సైన్స్ ఫిక్షన్ నేపథ్యంలో యాక్షన్ ఫాంటసీ మూమెంట్స్‌తో ఈ చిత్రాన్ని అత్యంత విపులంగా తెరకెక్కించనున్నట్లు సమాచారం. ఈ సినిమాను సన్ పిక్చర్స్ సంస్థ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. ఇటీవల పుట్టినరోజు సందర్భంగా ఈ ప్రాజెక్టును అధికారికంగా ప్రకటించగా, ఇప్పుడు కథానాయిక పేరును ఖరారు చేస్తూ మరో కీలక అప్‌డేట్‌ను చిత్రబృందం విడుదల చేసింది. బాలీవుడ్ టాప్ హీరోయిన్ దీపికా పదుకొనే ఈ సినిమాలో కథానాయికగా నటించనున్నట్లు అధికారికంగా ప్రకటించారు.ప్రత్యేక వీడియో ప్రకటనతో ఆసక్తి రెట్టింపు దీపికా పాత్రలో ఊహించని మలుపులు దీపికా పదుకొనే ఈ సినిమాలో కీలక పాత్ర పోషించనున్నట్లు ప్రకటించడమే కాకుండా, ఆ ప్రకటనకు ప్రత్యేకంగా రూపొందించిన వీడియోను విడుదల చేయడం విశేషం. ఆ వీడియోలో దర్శకుడు అట్లీ ఆమెకు ఆమె పాత్ర విశేషాలను వివరించటం, ఇద్దరి మధ్య చర్చలు, కథలోని విజన్ ఆడియన్స్‌లో ఆసక్తిని మరింతగా పెంచేశాయి. దీపికా పాత్రలో బలమైన పర్సనాలిటీ, శక్తివంతమైన యాక్షన్ ఎలిమెంట్స్ ఉంటాయని సమాచారం. ఆమె పాత్ర చుట్టూ సినిమా కథలో కీలకమైన మలుపులు తిరిగే అవకాశం ఉందని తెలిసింది. దీపికా బాలీవుడ్ స్థాయిలోనే కాకుండా, అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన నటి కావడంతో, ఈ సినిమాలో ఆమె ప్రెజెన్స్ సినిమాకు కొత్త డైమెన్షన్ ఇవ్వనుందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఫొటో క్లిక్




# కుటుంబంతో కలిసి బక్రీద్ సెలబ్రేషన్స్ జరుపుకున్న పూర్ణ




టాలీవుడ్ హీరోయిన్,పూర్ణ గురించి ప్రత్యేక పరిచయాలు అక్కర్లేదు. పలు సూపర్ హిట్ సినిమాల్లో నటించి మెప్పించిన ఈ అందాల తార శ్రీ మహాలక్ష్మి సినిమా తో తెలుగు ఇండస్ట్రీకి పరిచయమైంది . సీమ టపాకాయ్, అవును తదితర సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. హీరోయిన్ గానే కాకుండా సపోర్టింగ్ రోల్స్‌లోను మెరిసింది. దసరా, అఖండ, గుంటూరు కారం, డెవిల్ తదితర సినిమాల్లో సపోర్టింగ్ రోల్స్ తో అదరగొట్టింది. అలాగే పలు టీవీ షోల్లోనూ కనిపించి సందడి చేసింది. ఇక ఈ అమ్మడు కెరీర్ పీక్స్‌లో ఉండగానే దుబాయ్ కు చెందిన వ్యాపారవేత్త షానిద్ అసిఫ్ అలీతో పెళ్లి పీటలెక్కింది. 2022 జూన్ 12న దుబాయిలో వివాహం చేసుకుంది.సంబంధించిన ఫొటోలు ఏప్రిల్ 2023లో హమ్దాన్ అసిఫ్ అలీ అనే పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది పూర్ణ. అప్పుడప్పుడు పూర్ణ(%ూశీశీతీఋ%) సోషల్ మీడియాలో తన కుమారుడి ఫొటోలని షేర్ చేస్తూ ఉంటుంది. ఆ మధ్య తన కుమారుడి రెండో పుట్టిన రోజు వేడుకలను గ్రాండ్ గా నిర్వహించారు పూర్ణ దంపతులు.అందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో తెగ హల్‌చల్ చేశాయి. ఇక నటి పూర్ణ అలియాస్ షమ్నా ఖాసీం తన భర్త, కొడుకులతో కలిసి నేడు బక్రీద్ పండుగను సెలబ్రేట్ చేసుకుంది. ఈ సందర్భంగా స్పెషల్ ఫొటోలు తన సోషల్ మీడియాలో షేర్ చేసి శుభాకాంక్షలు తెలిపింది.

# కళావతి కసెక్కించే పెర్ఫార్మెన్స్ ఇస్తోందా!



కానీ ఆన్ సెట్స్ లో కీర్తి సురేష్ బోల్డ్ అప్పిరియన్స్ తో ఆకట్టుకుంటుందని నెట్ ఫ్లిక్స్ వర్గాల నుంచి లీకైంది. బాలీవుడ్ వెబ్ సిరీస్ 'అక్క'తో కీర్తి సురేష్ ఎంట్రీ ఇస్తోన్న సంగతి తెలిసిందే. తిరుగుబాటు దారుల కుట్రలను తిప్పికొట్టే రివేంజ్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతోన్న సిరీస్ ఇది. ఇదే సిరీస్ తో ధర్మరాజ్ శెట్టి దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. యశ్ రాజ్ ఫిలింస్ ఈ సిరీస్ ను ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుంది. ఇందులో రాధిక ఆప్టే మరో కథానాయికగా నటిస్తుంది. అంటే రాధికతో కీర్తి సురేష్ పోటీ పడి నటించాల్సిన పరిస్థితి ఇది. ప్రస్తుతం సెట్స్ లో ఉన్న సిరీస్ గురించి మరిన్ని విషయాలు లీక్ అయ్యాయి. ఇందులో కీర్తి సురేష్ మాఫి యా లేడీ డాన్ పాత్ర పోషిస్తుంది. కంటెట్ కాస్త బోల్డ్ గాను ఉంటుందని తొలి నుంచి ప్రచారంలో ఉంది. అలాంటి పెర్ఫార్మెన్స్ విషయంలో రాధికా ఆప్టే ఎక్కడా తగ్గదు. బోల్డ్ సన్నివేశాల ఎలివేషన్ పరంగా తనదైన మార్క్ వేస్తుంది. అలాగని కీర్తి సురేష్ కూడా ఎక్కడా తగ్గలేదు. తొలుత రాధికతో పోటీ పడగలదా? అన్న సందేహం వ్యక్తమంది. సీనియర్ డైరెక్టర్లు కానీ ఆన్ సెట్స్ లో కీర్తి సురేష్ బోల్డ్ అప్పిరియన్స్ తో ఆకట్టుకుంటుందని నెట్ ఫ్లిక్స్ వర్గాల నుంచి లీకైంది. రొమాంటిక్ సన్నివేశాల్లో కీర్తి ఎక్కడా రాజీ లేకుండా నటిస్తుందిట. తెరపై ఆ సన్నివేశాలు సరికొత్త అనుభూతి పంచుతాయంటున్నారు. రాధికా ఆప్టే బోల్డ్ అప్పిరియన్స్ గురించి అందిరికీ తెలుసు. కానీ కీర్తి సురేష్ మాత్రం సినిమాల కోసమే అంత లిబర్టీ తీసుకోలేదు. అక్క సిరీస్ కోసం మాత్రం ఎక్కడా ఆలోచిం చకుండా నటిస్తుంది. బాలీవుడ్ లో స్ట్రాంగ్ కెరీర్ ని బిల్డ్ చేసుకునే ప్రక్రియలో భాగంగా రాజీ పడటం లేదు. పోటీని ఎదుర్కొని నిలబడాలంటే ఆ మాత్రం అప్పిరి యన్స్ తప్పనిసరిగా భావించి ముందుకెళ్తున్నట్లు కనిపిస్తుంది. మొత్తానికి 'అక్క' సిరీస్ లో సరికొత్త కీర్తిని చూడటం ఖాయమే.

# టాలీవుడ్‌లో సమస్యలపై ప్రత్యేక కమిట




తెలుగు సినిమా పరిశ్రమలో సమస్యల పరిష్కారం దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇటీవల థియేటర్ల బంద్ వివాదం, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆగ్రహం.. తదితర పరిణామాలపై తాజాగా ఓ కమిటీ ఏర్పాటైంది. ఇండస్ట్రీలో నెలకొన్న సమస్యలకు పరిష్కారం సూచించేందుకు నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లతో కలిపి మొత్తం 30 మందితో ఈ కమిటీ ఏర్పాటైంది. తెలుగు ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు భరత్ భూషణ్ ఈ కమిటీకి ఛైర్మన్ గా వ్యవహరించనుండగా.. ఫిల్మ్ ఛాంబర్ సెక్రటరీ దామోదర ప్రసాద్ కన్వీనర్ గా వ్యవహరిస్తారు. ప్రొడ్యూసర్ సెక్టార్ నుంచి 10 మంది, డిస్ట్రిబ్యూటర్ సెక్టార్ నుంచి 10 మంది, ఎగ్జిబిటర్ సెక్టార్ నుంచి 10 మంది ఇందులో సభ్యులుగా ఉంటారు.

# స్టేజీపై నుంచే ప్రేయసికి ప్రపోజ్ చేసిన 'టూరిస్ట్ ఫ్యామిలీ' దర్శకుడు.. వీడియో



తమిళంలో చిన్నా సినిమాగా విడుదలై బ్లాక్ బస్టర్ అందుకోవడమే కాకుండా సినీ ప్రముఖులు ప్రశంసలు అందుకున్న చిత్రం టూరిస్ట్ ఫ్యామిలీ. నటులు శశికుమార్, సిమ్రాన్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రంలో నటులు యోగి బాబు, మిథున్ జై శంకర్, కమలేష్ జెగన్, ఎం.ఎస్. భాస్కర్, రమేష్ తిలక్, భగవతి పెరుమాళ్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. అభిషన్ జీవింత్ ఈ సినిమాకు దర్శకత్వం వహించాడు. మే 01న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం సూపర్ హిట్‌ను అందుకుంది. తలైవర్ రజనీకాంత్‌తో పాటు నటుడు శివకార్తికేయన్, ధనుష్, ఎస్.ఎస్ రాజమౌళి, సూర్య, నాని సినిమాపై ప్రశంసలు కురిపించారు. అయితే తాజాగా ఈ సినిమా ఓటీటీలోకి వచ్చిన విషయం తెలిసిందే. తమిళంతో పాటు తెలుగు, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో ఈ సినిమా ప్రస్తుతం స్ట్రీమింగ్ అవుతుంది. అయితే ఈ సినిమా ఓటీటీకి వచ్చాక ఇతర భాషా ప్రేక్షకులకు కూడా అందుబాటులోకి రావడంతో ప్రేక్షకులు ఈ సినిమాను చూసి చాలా రోజులకు ఒక మంచి సినిమాను చూశామంటూ కితాబిస్తున్నారు.ఇదిలావుంటే ఈ సినిమా ఈవెంట్‌లో భాగంగా చాలా రోజుల కిందటా.. దర్శకుడు అభిషన్ జీవింత్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అభిషన్ జీవింత్ ఈ వేడుకలో మాట్లాడుతూ.. చిత్రయూనిట్‌కి ధన్యవాదాలు చెప్పిన అనంతరం తన ప్రేయాసి అఖిలను నన్ను పెళ్లి చేసుకుంటావా అని స్టేజీపై నుంచే అడగడంతో అందరూ ఒక్కసారిగా షాక్ అయ్యారు.అఖిల నా జీవితంలో చిన్ననాటి నుంచి ఉంది. టెన్త్ తర్వాత మేమిద్దరం ఎక్కవ క్లోజ్ అయ్యాం.. నా ప్రతి అడుగులో తాను ఉంది. అందుకే తనకు థాంక్స్ చెప్పాలి. అలాగే అందరిముందు నిన్ను ఒక విషయం అడగాలనుకుంటున్నాను. అక్టోబర్ 31న నువ్వు నన్ను పెళ్లి చేసుకుంటావా. నేను నిన్ను చాలా ప్రేమిస్తున్నాను. మా అమ్మ దగ్గర ఉన్నప్పుడు ఎంత కిక్ ఉంటుందో నీ దగ్గర ఉన్నప్పుడు అంత సంతోషంగా ఉంటాను అంటూ అభిషన్ ఎమోషనల్ అయ్యాడు. ఇక అభిషన్ మాటాలకి అఖిల కూడా కన్నీళ్లు పెట్టుకుంది. కాగా ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339